ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

3

సోమవారం 6 మే 2024





సభలో ప్రసంగిస్తున్న పవన్‌కల్యాణ్, వేదికపై ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, అంబటి రాయుడు, బీజేపీ నేత సత్యకుమార్ తదితరులు



పొన్నూరు పవన్‌కల్యాణ్ సభకు హాజరైన జన సందోహం

కులం కావాలా.. అభివృద్ధి కావాలా: పెమ్మసాని

ఒక్క ఛాన్సని మనం జగన్‌కు అధికారం ఇస్తే పోలవరం లేదు. రాజధాని లేదు, ప్రజల బత్తుకుకు భరోసా లేదు. తాగడానికి నీరులేదు. ఆస్తికి భద్రత లేదు.. అని గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఇక్కడ ఒక ఎంపీ, ఎమ్మెల్యే కులం గురించి మాట్లాడుతున్నారు. గుణం లేనివారే కులం గురించి మాట్లాడుతారు. మానవత్వం లేనివారే మతం గురించి మాట్లాడుతారన్నారు. గుణం కావాలో, అభివృద్ధి కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. మనిషి కష్టంలో ఉన్నప్పుడు చేయి అందించడం, భుజం తట్టడం, ఆత్మబంధువు మాత్రమే చేయగలడని అలాంటి ఆత్మబంధువు, నీతి నిజాయితీకి ప్రతి రూపం పవన్‌కల్యాణ్ అన్నారు.





సూపర్ సిక్స్ పథకాలపై విద్యార్థినుల ప్రదర్శన



పొన్నూరు పోటెత్తింది..

- మండుటెండలో మహాజనం
- పవన్‌కల్యాణ్‌కు అపూర్వ స్వాగతం
- జనసంద్రంలా వారాహి విజయభేరి సభ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండే ఎండ అయినా అభిమాన నేత కోసం పోటెత్తిన జనం. మూడు గంటల ఆలస్యమైనా విసిగిపోకుండా ఉరిమే ఉత్సాహం తొణికిసలాడింది. భానుడి భగభగల మధ్యే జనసేనానికి అభిమాన జనం అపూర్వ స్వాగతం పలికింది. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం పొన్నూరులో పవన్‌కల్యాణ్ పర్యటించారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని నిర్వాహకులు ప్రకటించగా మూడు గంటల ఆలస్యంగా పవన్ పొన్నూరు వచ్చారు. అప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, పవన్ అభిమానులు రాకతో పొన్నూరు వీదులు జన ప్రవాహాన్ని తలపించాయి. ఎటు చూసినా ఉరకలెత్తే ఉత్సాహంతో యువకులు, మహిళలు, చిన్నారులు జయజయధ్వానాల మధ్య పవన్ రోడ్ షో జరిగింది. తొలుత ఆయన సజ్జా ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు రాగా అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల మేర పట్టణ వీధుల్లో రోడ్ షో జరగ్గా అడుగడుగునా యువకులు పవన్ కళ్యాణ్‌కు బ్రహ్మరథం పట్టారు. సభా ప్రాంగణానికి పవన్ చేరుకునే సరికి ఆ ప్రాంతం జనంతో కిటకిటలాడిపోయింది. మండుటెండను సైతం లెక్క చేయని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులను చూసి పవన్ ఉద్వేగపూరితమైన ప్రసంగం చేశారు. వైసీపీ పాలనపైన, నేతల అరాచకాలు, దోపిడీపై ధ్వజమెత్తారు. గుంటూరు కారం ఘాటు నా రక్తంలోనే ఉందంటూ పవన్ సీఎం జగన్‌కు హెచ్చరికలు పంపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వనమా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● ధర్మానిదే విజయం..

గుర్రం జాషువా, ఆచార్య రంగా, చేనేత ప్రతినిధి ప్రగడ కోటయ్య నడయాడిన గడ్డమీద ఉండి చెబుతున్నా ధర్మానిదే విజయం.. కూటమిదే గెలుపు అని పవన్ తేల్చిచెప్పారు. 2021 మార్చి 14న ఇప్పటం గ్రామంలో చెప్పినట్లుగా వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వనన్నారు. ఓటు చీలకుండా ఉంటేనే 5 కోట్ల ఆంధ్రుల బతుకు బాగుంటుందన్నారు. వైసీపీకి మద్దతుగా ఉన్న వారు కూడా ఆలోచించుకోండి అంటూ బర్నబస్, అమర్నాథ్ ఉదంతాలను వివరించారు. రోడ్లపై గోతులు.. మాట్లాడితే దాడులు.. నోట్లో నుంచి బూతులు, ఎర్రమట్టి దోపిడీలు తప్ప వైసీపీ మనకు ఏమిచ్చిందంటూ ఆ పార్టీ నేతలను నిలదీశారు. కష్టజీవులను, కండ కరిగించే రైతు కష్టాన్ని దోచి క్లాస్ వార్ అంటున్నారు.. ఇదెక్కడి దుర్మార్గం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశంసలు..

సంగం డెయిరీని మూసేయించి పాల ఉత్పత్తిలో గుత్తాధిపత్యం తేవాలని చూసిన జగన్‌కు ధూళిపాళ్ల నరేంద్ర సరైన సమాధానం చెప్పారన్నారు. ఐదేళ్లు పోరాడి, జైలుకు వెళ్లి పాడి రైతుల ఉపాధికి బాసటగా నిలిచారన్నారు. ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. నా మోచేతి నీళ్లు తాగాలి అని జగన్ అంటే.. ఆత్మగౌరవమున్న అంబటి రాయుడు కాదపొమ్మన్నాడని ప్రశంసించారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని తెలుగు మాతృభాషలో చదివి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. నిజాయితీ, చిత్తశుద్ధి ఉన్న నాయకులు లోక్‌సభకు వెళ్లాలని నేను ఆయనకు మద్దతుగా వచ్చానన్నారు. స్వదేశ్ సినిమాలో షారూక్ ఖాన్‌లాగా నాగుంటూరు బాగుండాలి, నాఆంధ్రా బాగుండాలని పెమ్మసాని అమెరికా నుంచి దేశానికి వచ్చాడని, ఆయన కుడబ్బుకన్నా వేల రెట్లు ధైర్యం ఉందని ప్రశంసించారు.



టీడీపీ, జనసేన జెండాలతో కొబ్బరిచెట్టుపై కూర్చుని..

● వైసీపీని క్లీన్ బౌల్డ్ చేయండి : రాయుడు

వైసీపీ వారి మాట నమ్మకండి. వారికి కావాల్సింది బానిసత్వమే. మీరు పేదరికంలో ఉండటమే వారికి కావాలి. అదే వారి బలం. కాబట్టి వారికి దూరంగా ఉండండి. కూటమి అభ్యర్థులకు ఓటేయండి. అది పవనన్నకే ఓటేసినట్లు అవుతుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు చెప్పారు. వైసీపీని క్లీన్ బౌల్డ్ చేసే అవకాశం ప్రతి ఒక్కరికి వచ్చింది. వినియోగించుకోండి. చేతులు జోడించి అడుగు తున్నా.. రాష్ట్రాన్ని కాపాడండి అని రాయుడు విజ్ఞప్తి చేశారు.

రూ.2 వేల కోట్ల మట్టి దోపిడీ

పొన్నూరులో 700 ఎకరాల్లో ఎర్ర మట్టి గ్రావెల్ తవ్వి ఇక్కడి ఎమ్మెల్యే, ఇప్పటి ఎంపీ అభ్యర్థి 2 వేల కోట్లు దోచేశారని పవన్ ఆరోపించారు. ఉమ్మారెడ్డి కుటుంబం నుంచి వచ్చిన వారు ఇంత దోపిడీ చేస్తారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కిలారి దోపిడీ మకిలి ఉమ్మారెడ్డికీ అంటక తప్పదన్నారు. పొన్నూరులో 12 లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు ఆపేశారని తెలిపారు. రేషన్ పెద్ద మాఫియా లా తయారైందని పొన్నూరు నుంచి కాకినాడలోని ద్వారంపూడి చంద్రశేఖర్ ద్వారా బియ్యాన్ని ఆఫ్రికాకు తరలిస్తున్నారని ఆరోపించారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అసహనం

- పలు చోట్ల ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభం
- బాపట్లలో పట్టణ సీఐపై వైసీపీ శ్రేణుల ఆగ్రహం
- కేంద్రాల వద్ద వైసీపీ నేతల తిష్ట.. యథేచ్ఛగా ప్రలోభాలు



రేపల్లె ఆర్.సి కళాశాలలో పోస్టల్ ఓటింగ్ బూత్‌ల వద్ద నిరీక్షిస్తున్న ఉద్యోగ ఓటర్లు

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగుల ఓటు హక్కు వినియోగం కోసం నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఆదివారం నుంచి మొదలైంది. పలు దగ్గర్ల ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. తొలిరోజు ఓపీఓ(అదర్ పోలింగ్ ఆఫీసర్స్)లకు అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా వీరి సంఖ్య 5,763 మంది ఉండగా 5,292 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో తొలి రోజు నుంచే ప్రలోభాల పర్వానికి పాలకపార్టీ తెరలేపింది. నేతలతో పాటు వైసీపీ శ్రేణులూ కేంద్రాల దగ్గర తిష్ట వేసి ఉద్యోగుల ఓట్లను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు చేపట్టారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పీఏ కె.కిషోర్, వైసీపీ నాయకులతో కలిసి బాపట్ల మున్సిపల్ హైస్కూల్ దగ్గర హడావిడి చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టాలని చూచిన వైసీపీ శ్రేణులను పంపించే ప్రయత్నం చేసిన సీఐ యు.శ్రీనివాసులుపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కోన అనుచరుల ప్రలోభాలు, ఒత్తిళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదని టీడీపీ, జనసేన నాయకులు ఆరోపించారు. రేపల్లెకు సంబంధించి ఇసుకపల్లిలోని ఆర్.సి కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. ఎన్నికల అధికారుల అలసత్వం కారణంగానే ఈ విధంగా జరిగిందని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. 11.30 వరకు ఉద్యోగులు చెట్ల కింద నిరీక్షించాల్సి వచ్చింది.



సీఐ శ్రీనివాసులును హెచ్చరిక ధోరణిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన అనుచరుడు కె.కిషోర్, వైసీపీశ్రేణులు

ఓటు హక్కు కోల్పోకూడదు

బాపట్ల: ఎన్నికల విధుల్లో ఉన్న ఏ ఒక్క ఉద్యోగి కూడా తమ ఓటు హక్కు కోల్పోకూడదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మరో అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపా రు. ఇప్పటి వరకు ఫారం -12 ఓటు కోసం దరఖాస్తు చేయని వారికి మరో అవకాశం వచ్చిందన్నారు. 7, 8 తేదీల్లో ఆర్వోలను సంప్రదించి ఫెసిలిటేషన్ కేంద్రంలో ఫారం-12 అందజేసి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

నీట్.. 98 శాతం

వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ నిర్వహించిన నేషనల్ ఎలిజి బులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. గుంటూరులో ఏర్పాటు చేసిన 10 కేంద్రాల్లో 98శాతం విద్యార్థులు హాజరయ్యారు.

- గుంటూరు(విద్య)



గుంటూరు: పరీక్షా కేంద్రంలో బారులు తీరిన విద్యార్థినులు

పే.. ప్రలోభాలు



- రూటుమార్చి డిజిటల్ ప్రలోభాలు
- డిజిటల్ లావాదేవీలపై కొరవడిన నిఘా
- బ్యాంకులు, యూపీఐ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నగదు బదిలీలు
- బ్యాంకు వర్గాలకు, ఎక్స్‌పెండీచర్ టీంకు కొరవడిన సమన్వయం
- ఒకే ఖాతా నుంచి పదుల సంఖ్యలో ట్రాన్సాక్షన్స్ జరుగుతున్నా మౌనమే

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఓ వైసీపీ నేత బ్యాంకు ఖాతా నుంచి కొన్ని రోజులుగా లక్షల్లో లావాదేవీలు జరిగాయి. గూగు ల్‌పే, ఫోన్‌పే వంటి యూపీఐ లావాదేవీల ద్వారా చిన్న మొత్తాలు పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫర్ జరుగుతున్నాయి. అద్దంకి పరిధిలోని ఓ వైసీపీ ద్వితీయశ్రేణి నేత ఖాతా నుంచి మూడు వేల నుంచి ఐదువేల వరకు నగదు పదుల సంఖ్యలో వ్యక్తులకు యూపీఐ ట్రాన్సాక్షన్స్ జరిగాయి. రోజూ ఇలాంటి లావాదేవీలు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో జరుగుతున్నాయి. అవేవీ అధికారులకు అనుమానా స్పదంగా కనిపించడం లేదు. పైగా వాటిపై కనీస దృష్టి కూడా సారించక పోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లాలో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచడంతో అభ్యర్థులు రూటుమార్చి డిజిటల్ లావాదేవీల ద్వారా ప్రలోభాలపై దృష్టిపెట్టారు. ఇటు బ్యాంకు వర్గాలతో పాటు అధికారుల వైపు నుంచి పెద్దగా పర్యవేక్షణ లేకపోవడం వారికి కలిసివస్తోంది. పదిలక్షల నగదుకు మించి జరిగిన లావా దేవీల రోజువారీ రికార్డును బ్యాంకు వర్గాలు ఎక్స్‌పెండీచర్ మానిటర్ విభాగానికి అందిస్తున్నాయి తప్పితే వాటి మూలాలు కనుగొనడంపై దృష్టి సారించడంలేదనే విమర్శలున్నాయి.

రోజు వారీ లావాదేవీల జాబితా..

బ్యాంకు ఖాతాల ద్వారా పది లక్షల నుంచి 50 లక్షల వరకు జరుగుతున్న లావాదేవీల జాబితాను అటు ఎక్స్‌పెండీచర్ టీంకు అందించడంతో పాటు ఐటీ విభాగానికి బ్యాంకర్లు నిత్యం చేరవేయాలి. అయితే వీటిలో అనుమానాస్పద లావాదేవీలేవీలపై కసరత్తు లేదు. బ్యాంకులు రోజువారీ అందిస్తున్న జాబితా ప్రకారం ఒక్క బాపట్ల జిల్లాలోనే ప్రతి రోజు పది లక్షలకు మించి లావాదేవీలు జరుగుతున్న ఖాతాలు 40 దాకా ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు వందల్లో ఉండొచ్చనేది సమాచారం.

చిన్న మొత్తాల సంగతేంటి..

ఓటర్లను ప్రలోభాలపెట్టే క్రమంలో యూపీఐ ట్రాన్సాక్షన్స్‌ను రాజకీయపార్టీలు వాడుకుంటున్నాయి. చిన్న మొత్తాలపై ఎటువంటి నిఘా లేకపోవడం వారికి కలిసొచ్చింది. గ్రామంలోని ద్వితీయ శ్రేణి నేతకు పెద్ద మొత్తంలో నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, మూడు వేల నుంచి ఐదు వేలను సదరు నేత ఖాతా నుంచి రోజుకు వందల సంఖ్యలో కావాల్సిన వారికి చేరవేస్తున్నారు. ఈ లావాదేవీలేవీలపై ట్రాకింగ్ లేకపోవడంతో పాటు వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఈసీ నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో ఓటర్లను ప్రలోభపెట్టడానికి ఈ మార్గాన్ని నేతలు ఎంచుకుంటున్నారు

యువతకు డబ్బు ఎర చూపి..

బ్యాంకు ఖాతాలను వాడుకునే విషయంలో యువతకు డబ్బు ఎర చూపి వారి ఖాతాల్లో డబ్బు జమ చేయించి, వాటి ద్వారానే తాము అనుకున్న ఓటర్లకు డబ్బు చేరేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఇలాంటి వాటి విషయంలో యువకులు అప్రమత్తంగా ఉండాలని గతంలోనే పోలీసులు హెచ్చరించినప్పటికీ నేతలు వారి స్వలాభం కోసం వారి ఖాతాలను వాడుకుంటున్నారు. కోడ్ అమల్లోకి వచ్చి దాదాపు నెలరోజులు దాటింది. ఈ వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా జరిగిన బ్యాంకు లావాదేవీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా అటు బ్యాంకు వర్గాలకు కానీ, ఇటు ఎక్స్‌పెండీచర్ టీంకు, ఐటీ విభాగానికి కానీ అనిపించకపోవడం గమనార్హం. ఒకే ఖాతానుంచి పదుల సంఖ్యలో ఖాతాలకు చిన్న మొత్తాలు బదిలీ అయ్యే విషయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. ఎన్నికలకు ఇంకా వారం రోజుల సమయమే ఉన్నందున డిజిటల్ ప్లాట్‌ఫాంలు వేదికగా ప్రలోభాల పర్వం మరింత జోరందుకోనుంది.

ఇద్దరూ.. ఇద్దరే

- రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం
- సిట్టింగ్ ఎంపీగా ఇప్పటికే ఒకరు నిరూపించుకున్నారు...
- తొలి అడుగుతోనే మరొకరు ప్రభంజనం సృష్టించబోతున్నారు..


లావు శ్రీకృష్ణదేవరాయులు


పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మేౕ(ఆంధ్రజ్యోతి): సాధారణంగా రాజకీయాల్లోకి వచ్చి సంపాదించుకునే వారినే ఎక్కువగా చూస్తుంటాం. అలాకాకుండా తరతరాలకు సరిపడా ఆస్తిని సంపాదించుకొని సమాజానికి మేలు చేయాలనే సేవా నిరతితో రాజకీయాల్లోకి వచ్చేవారు ఎంతో అరుదు. అటువంటి జాబితాలో ఉమ్మడిగుంటూరు జిల్లాలోని గుంటూరు, నరసరావుపేట లోక్‌సభ స్థానాల నుంచి టీడీపీ అభ్యర్థులుగా ఎన్నికల బరిలోకి దిగిన విద్యావంతులు, యువకులు అయిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయులు చోటుపొందారు. వీరిలో ఒకరైన శ్రీకృష్ణదేవరాయులు ఇప్పటికే సిట్టింగ్ ఎంపీగా వ్యవహరిస్తూ ఈ ఐదేళ్లలో తన నిజాయితీని, సేవాతత్పరతను చాటుకున్నారు. విద్యావంతుడైన కృష్ణదేవరాయులు ఉమ్మడి రాష్ట్రంలోకే పేరొందిన విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య కుమారుడు. కృష్ణదేవరాయులు ఆ సంస్థల వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఇతను కూడా శ్రీమంతుడే. మొదటి అడుగు వైసీపీ ద్వారా వేసి ఎంపీగా గెలుపొందినప్పటికీ తన పంథాకు, విలువలకు భంగం కలగకుండా ఇప్పటివరకు పయనం సాగించటం విశేషం. వైసీపీ భావజాలాలు ముఖ్యంగా ప్రత్యర్థులపైనే కాకుండా వారి కుటుంబీకులపై సైతం బూతులు తిట్టే సంప్రదాయం నచ్చక ఆ పార్టీని వీడి టీడీపీలో చేరి అదే నరసరావుపేట నియోజకవర్గం నుంచి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గత ఐదేళ్లలో తన లోక్‌సభ నియోజకవర్గం ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు ఎటువంటి సహకారం లభించనప్పటికీ నేరుగా కేంద్ర మంత్రులతో పరిచయాలు పెట్టుకొని వారి సహకారంతో పల్నాడు ప్రాంతంలో తనదైన అభివృద్ధి మార్కు కొంతమేరకు వేసుకో గలిగారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు తన ద్వారా ప్రారంభమై మధ్యలో ఉండటంతో తిరిగి అవి కొనసాగించాలంటే అదే నియోజకవర్గం నుంచి తిరిగి ఎంపీగా గెలిస్తే సాధ్యమవుతుందని భావించాడు. అయితే వైసీపీ అధిష్టానం అతన్ని గుంటూరు పార్లమెంటు నుంచి పోటీ చేయమని ఆదేశించటంతో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అదే సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు లావుకు నరసరావుపేట నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. వైసీపీలో కొనసాగినా విలువలతో వ్యవహరించటం వల్ల చంద్రబాబుకు లావు నచ్చారు. అంతేకాదు వైసీపీ ఎంపీగా కొనసాగుతూ కూడా కోస్తాంధ్రలో ఏ వైసీపీ నేత చేయని సాహసం ఆయన చేశారు. అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని ఉద్యమంచేస్తున్న రైతులశిబిరం వద్దకు కృష్ణదేవరాయులు వెళ్లి వారికి మద్దతు పలికారు. ఆ చర్య వైసీపీ అధిష్టానానికి కంటగింపయింది. అందుకే ఆయనను పొమ్మనకుండా పొగబెట్టి పంపేశారు. తిరిగి తనను గెలిపిస్తే పల్నాడును సిరుల మాగాణిగా మారుస్తాననే నినాదంతో ఆయన ప్రచారంలో తనదైన పంథాలో దూసుకుపోతున్నారు.

తొలి అడుగుతోనే... అమెరికాలో స్థిరపడి వేలకోట్ల ఆస్తి గడించి కూడా జన్మభూమి రుణం తీర్చుకోవాలనే సదాశయంతో రాజకీయాల్లోకి తొలి అడుగు వేసి గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రాజకీయాల్లో ఓ ప్రభంజనంలా దూసుకుపోతున్నారు. నామినేషన్ దాఖలు సమయంలో తన ఆస్తిపాస్తులను వివరించటంతో ఒక్కసారిగా రాష్ట్రం మొత్తం ఉలిక్కిపడింది. రూ.5,705 కోట్లు తన ఆస్తిగా చూపి దేశంలోని సంపన్న ఎంపీ అభ్యర్థుల్లో ఒకడిగా నిలిచిన పెమ్మసాని కేవలం కొద్దినెలల్లోనే తనదైన వ్యవహారశైలితో పార్టీ శ్రేణులకు దగ్గరయ్యారు. అంతే కాదు ఎన్నికల ప్రచార సభల్లో తన తీరు, మాటలతో సామాన్య ప్రజల్లో సైతం ఓ నమ్మకం కలుగచేయగలిగారు. కొద్ది సమయంలోనే లోక్‌సభ స్థానంపరిధిలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు విస్తృతంగా పర్యటించి ఒక క్రేజ్ సృష్టించుకున్నారు. తన లోక్‌సభ స్థానం పరిధిలో బరిలో నిలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులతో ఎంతో కలివిడిగా కలిసిపోతూ తాను ఎంతో సంపన్నవంతుడిని అనే గర్వం ఏ కోశానా లేకుండా వారికి సైతం ఎంతో ఆత్మీయుడైపోయారు. తనది తొలి అడుగుగా చెప్పుకుంటూ లోక్‌సభ స్థానంలో అడుగు పెట్టినప్పటికీ ఎంతో ఆరితేరిన నాయకుడిలా పార్టీకి దూరంగా ఉంటున్న వారిని ఎంతో మందిని తిరిగి కార్యోన్ముఖులుగా చేయగలిగారు. వైసీపీని వీడినప్పటికీ తటస్థంగా ఉంటున్న నియోజకవర్గ స్థాయి నేతలతో సైతం దౌత్యం నడిపి టీడీపీ అధికారంలోకి వస్తే తగిన ప్రాధాన్యం ఇస్తామనే భరోసాతో వారిని పార్టీలో చేరేలా చేశారు. తొలి నాళ్లలో విమర్శలు చేసిన ప్రత్యర్థి పార్టీల వారిని సైతం ముక్కున వేలేసుకునేలా చేశారు. తనను గెలిపిస్తే రాజకీయాల్లో నూతన ఒరవడికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ప్రచారంలో పెమ్మసాని దూసుకుపోతున్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

- నారా బ్రాహ్మణి • మత్స్యకార మహిళలతో మాటామంతి


మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న నారా బ్రాహ్మణి

మంగళగిరి, మేౕ: ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని నారా బ్రాహ్మణి అన్నారు. ఉండవల్లి పీడబ్ల్యూడీ వర్కుషాపు వద్ద కృష్ణాతీరం వెంబడి వున్న మత్స్యకారులను ఆమె ఆదివారం ఉదయం కలుసుకున్నారు. వారి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు హయాంలో చేపలు పట్టుకునేందుకు రెండెకరాల స్థలం కేటాయించారని, కానీ ఇందులో గత అయిదేళ్లలో మార్కెట్‌ను నిర్మించకపోవడంతో తాము అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మత్స్యకారులు చెప్పారు. కరోనా సమయంలో నారా లోకేశ్ తమకు భోజనాలను పెట్టించడంతోపాటు తమ ప్రతీ కుటుంబానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేయించారన్నారు. తమకు నివేశన స్థలాలను ఇప్పించాలని, చేపల మార్కెట్ నిర్మాణం చేయించాలని, వేటలేని సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించాలని, తమ బిడ్డల వివాహాలను జరిపించుకోవడానికి వీలుగా కళ్యాణ మండపాన్ని కట్టించి ఇవ్వాలని మత్స్యకారులు బ్రాహ్మణికి విజ్ఞప్తిచేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని, నివేశనస్థలాల పంపిణీతోపాటు కమ్యూనిటీ హాలును నిర్మించి ఇస్తామని హామీలనిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, జంజనం వెంకట సాంబశివరావు, సామల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, దామర్ల రాజు, సంకా బాలాజీ గుప్తా, చావలి ఉల్లయ్య, కొత్తపల్లి శ్రీనివాసరావు, ఆకుల జయసత్య, ఆరుద్ర భూలక్ష్మి, కొమ్మారెడ్డి వీరారెడ్డి, రంగిశెట్టి పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


ముప్పాళ్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కన్నా, లావు

ప్రతి గ్రామానికి తాగు, సాగు నీరు

- ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ల మే 5: పలనాడు ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యం అని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఆదివారం ముప్పాళ్ల మండలంలోని నార్నెపాడు, తొండపి గ్రామాల్లో కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. లావు మాట్లడుతూ.. నేడు రాష్ట్రంలో అధర్మం రాజ్యమేలుతుందని, ధర్మరక్షణకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందన్నారు. కన్నా మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు రావావాలన్నా, రాష్ట్రాభివృద్ధి జరిగి ప్రజలు సంక్షేమంగా జీవించాలన్నా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. అందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రజల ఓట్ల సునామీలో గల్లంతవం ఖాయమని అన్నారు. అన్ని రకాల ధరల భారాలు, పన్నుల పెంపుతో వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్ళి టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించారు. కూటమిని గెలిపించాలని కోరారు. ముందుగా గ్రామంలో ప్రచారానికి వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు, లావు శ్రీకృష్ణ దేవరాయలులకు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో లావు శ్రీకృష్ణ దేవరాయలు తండ్రి లావు రత్తయ్య, బొర్రా వెంకటప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబం.. ప్రచారం

- తండ్రికి మద్దతుగా ప్రత్తిపాటి స్వాతి
- భర్తకు మద్దతుగా లావు మేఘన ఎన్నికల ప్రచారం

చిలకలూరిపేట, మేౕ:తండ్రికి మద్దతుగా ప్రత్తిపాటిస్వాతి, భర్తకి చేదోడుగా లావు మేఘన చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. చిలకలూరిపేటఅసెంబ్లీ, నరసరావుపేట ఎంపీ టీడీపీ అభ్యర్థులు ప్రత్తిపాటి పుల్లారావు, లావు శ్రీకృష్ణదేవరాయలు తరఫున జరిపిన ప్రచారంలో వారిద్దరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదివారం చిలకలూరిపేట మండలం రాజాపేటలో తండ్రిసన్నిధి, పట్టణంలోని శాంతినిలయం చర్చిలను ప్రత్తిపాటి స్వాతి, లావు మేఘన సందర్శించారు. ప్రార్ధనా మందిరం వ్యవస్థాపకుడు, ప్రముఖ పాస్టర్ షాలెంరాజు, శాంతినిలయం పాస్టర్ బ్రదర్ క్రిస్టఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్ధనల్లో వారుపాల్గొన్నారు. క్రైస్తవులతో కలిసి ప్రార్ధనలు చేశారు. ప్రత్తిపాటి, లావు శ్రీకృష్ణదేవరాయలు విజయాన్ని కాంక్షిస్తూ ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రత్తిపాటి స్వాతి గతంలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేటను అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. ప్రత్తిపాటి మరోసారి గెలిపిస్తే అభివృద్ధిలో చిలకలూరిపేటను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తారని, ప్రజలకు మేలు చేస్తారని తెలిపారు. అనంతరం లావు మేఘన మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేస్తున్న వ్యక్తి నీతిపరుడా, అవినీతిపరుడా, అందుబాటులో ఉంటారా లేదా, మన పల్నాడును అభివృద్ధి చేయగలుగుతారా లేదా అనిచూసి నిర్ణయం తీసుకోవాలన్నారు. వీళ్ళు నాయకులుగా ఉంటే రేపు మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందా లేదా అనేది కూడా ఒకసారి ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు అందరి ఆశీస్సులు కావాలని వారు ప్రజలను కోరారు.


ప్రార్ధనలలో పాల్గొన్న ప్రత్తిపాటి స్వాతి, లావు మేఘన

'నీట్'గా ముగిసింది

- 98 శాతం విద్యార్థులు హాజరు
- ఫేషియల్స్, బయోమెట్రిక్ అటెండెన్స్‌తో తనిఖీ


కేంద్రాల్లోకి వస్తున్న విద్యార్థులు


పరీక్షకు ముందుగా విద్యార్థిని ఫేషియల్ అటెండెన్స్ తీసుకుంటున్న సిబ్బంది

గుంటూరు(విద్య),మే 5: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని మొత్తం 10 కేంద్రాల్లో 4466 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4248 మంది (98 శాతం) హాజరయ్యారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి 1.30 నుంచే అనుమతించారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభమై సాయంత్రం 5.30వరకు జరిగింది. పరీక్షా కేంద్రంలోని అనుమతించే ముందు విద్యార్థులను ఫేషియల్, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం ద్వారా గుర్తించి కేంద్రాల్లోకి పంపారు. ఎండ వేడిమికి విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.



పిడుగుపడి 59 మేకలు మృతి

- ఇద్దరు కాపరులకు అస్వస్థత

దుర్గి, మే 5: పిడుగుపడి 59 మేకలు మృతిచెందగా ఇరువురు మేకల కాపరులు అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని కాకిరాలకు చెందిన కొంగ గంగయ్య, గోవిందు, బూదూరు లక్ష్మయ్యలు ఆదివారం తమకు చెందిన సుమారు 200 మేకలను మేత కోసం గ్రామ శివారులోని అడివికి తీసుకొచ్చారు. సాయంత్రం సమయంలో అకస్మాత్తుగా పిడుగులతో కూడిన వర్షం పడడంతో మేకలతో సహా చెట్టు కిందకు చేరారు. అయితే చెట్టుపై పిడుగుపడడంతో 59 మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. గోవిందు, లక్ష్మయ్యలకు స్పృహ కోల్పోయారు. వారికి సమీపంలోనే ఉన్న గంగయ్య గ్రామస్తులకు సమాచారం అందించారు. గోవిందు, లక్ష్మయ్యలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్సనందిస్తున్నారు. మరణించిన మేకల విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని బాధితులు బోరున విలపించారు.

రెండు పాడి గేదెలు మృతి

రెంటచింతల: రెంటచింతలలోని ఓకోల్డ్ స్టోరేజ్ సమీపంలో పిడుగుపాటుకు రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన ఆదివారం సంభవించింది. రెంటచింతలకు చెందినబోయిన గురులింగం తన గేదెలను పొలంకు తోలాడు.. సాయంత్రం 4గంటల సమయంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి తోడు పిడుగులు పడడంతో రెండు పాడి గేదెలు అక్కడికక్కడే ప్రాణాలిడిచాయి. వీటి విలువ రూ.1.45 లక్షలు దాకా ఉంటుందని బాధితుడు చెప్పాడు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కారంపూడి: ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మండలంలోని పేటసన్నిగండ్లలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మద్యం, ఇన్నోవా కారు సీజ్

గుంటూరు(తూర్పు),మే5: సార్వత్రిక ఎన్నికలనేపథ్యంలో జిల్లాలో ఆదివారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ.6,650 విలువగల 7లీటర్ల మద్యం, ఒక ఇన్నోవా కారు, మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రూ.28,524 విలువగల 571 పార్టీ కరపత్రాలు, టీ షర్టులు, రూ.4,660 విలువ గల 7.55 లీటర్ల మద్యం, తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.1,47,360 విలువ గల 198.7 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో మే 5న సాయంత్రం 6 గంటల వరకు రూ.3,11,70,891 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

మా జీవితాలను నాశనం చేశారు

- 1601వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు, మే 5: రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం జీవనాధారమైన 33వేల ఎకరాల భూములిస్తే.. మూడు రాజధానులని రైతుల జీవితాలను సీఎం జగన్‌రెడ్డి నాశనం చేశాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క రూపాయి తీసుకోకుండా భూములిచ్చామన్నారు. వైసీపీ పాలకులు ఒక్క సెంటు ప్రజా అవసరాల కోసం భూమినివ్వమంటే ఇస్తారా.. అని ప్రశ్నించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద చేస్తున్న నిరసనలు ఆదివారం నాటికి 1601వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వైసీపీకి ఓటు వేస్తే జీవితాలు చేతులారా నాశనం చేసుకున్నట్లేనని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

కూటమితోనే బీసీలకు రక్షణ

- బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు


మనోహర్ సమక్షంలో కూటమికి ఐక్యంగా మద్దతు తెలుపుతున్న బీసీ నేతలు

తెనాలి రూరల్, మే 05: బీసీ కులానికి చెందిన 10వ తరగతి విద్యార్థి అమర్‌నాథ్ ఏం తప్పుచేశాడని దారుణంగా చంపారు. తన అక్కను వైసీపీకి చెందిన ఆకతాయిలు వేధిస్తున్నారన్న బాధతో వారిని నిలువరించే ప్రయత్నం చేయడమే నేరమా.. కాళ్లు చేతులు కట్టి మానవత్వం మరిచి పంటపొలాల్లో అతడిపై పెట్రోల్ పోసి కర్కసంగా నిప్పుపెట్టిచంపుతారా.. ఇదేనా వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు ఉన్న రక్షణ..? అని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్డీఏ కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు బీసీ సంక్షేమ సంఘం తరపున మద్దతు తెలుపుతూ ఆయన ప్రసంగించారు. బడుగు బలహీన వర్గాలైన బీసీలకు మంచి చేస్తానని ప్రజలను నమ్మబలుకుతూ ఒక్క చాన్స్ ఇస్తే బీసీల సంక్షేమానికి ఉన్న పలు పథకాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలు, అక్రమ కేసులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో బీసీలంతా ఐకమత్యంగా ఉంటూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలన్నారు.

ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విధ్వంస పాలనకు జగన్ మోహన్‌రెడ్డి తెరలేపారని అందుకు ఐదేళ్ల వైసీపీ పాలనే సాక్ష్యంగా నిలుస్తుదన్నారు. మూడు రాజధానులు అంటూ ప్రాంతాల మధ్య ప్రజల్లో చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. జగన్ అధికారంలోకి వచ్చాక బీసీల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు చేసిందేమిలేదని తెలుపుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనార్టీలు అంటూ లేని ప్రేమను ఉన్నట్లు నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. బీసీలకు రక్షణ చట్టం, వారి అభ్యున్నతికి పాటుబడేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని అన్నారు. తొలుత బీసీ సంక్షేమ సంఘం తరపున నాయకులు మనోహర్‌ను ఘనంగా సత్కరించి అందరం ఐకమత్యంగా ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపే కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని చేతులు కలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం పెద్దలు, సభ్యులు, పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

11 చంద్రబాబు ప్రజాగళం

- మాచర్ల, నరసరావుపేటలో బహిరంగ సభలు

నరసరావుపేట, మే 5: పల్నాడు జిల్లాలో తెలుగుదేశం ఎన్నికల ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 11న మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాలో ప్రజాగళం సభల్లో పాల్గొననున్నారు. చంద్రబాబు పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులో సభ నిర్వహించాలని స్థానిక నేతలు నిర్ణయించారు. టీడీపీ- జనసేన- బీజేపీ నేతలు కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి ముఖ్యనేతలు హాజరుకానున్నారు. ఎన్నికల ప్రచారం 11 సాయంత్రం 5 గంటలకు ముగించాల్సి ఉంది. నరసరావుపేట సభతో చంద్రబాబు ఎన్నికల ప్రచారాన్ని ముగించనున్నారు.

టీడీపీతోనే వడ్డెరలకు న్యాయం

- బీజేపీ జాతీయ కౌన్సిలింగ్ సభ్యుడు కృపారావు

దుర్గి, మే 5: టీడీపీతోనే వడ్డెరలకు న్యాయం జరుగుతుందని బీజేపీ జాతీయ కౌన్సిలింగ్ సభ్యుడు కృపారావు అన్నారు. మండల కేంద్రమైన దుర్గి జనసేన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల్లో 70 శాతం వడ్డెర కులస్తులేనని, వైసీపీ ప్రభుత్వంలో వడ్డెర కుటుంబాలు అస్తవ్యస్థ మయ్యాయన్నారు. జగన్ ఓ సారా వ్యాపారి అని, అధికారంలోకి రాగానే మద్యం, మట్టి, గ్రానైట్ వ్యాపారాలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో వెలిదండి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, కాట్రాజు నరసింహారావు, దేరంగుల శ్రీనివాసరావు, ఉప్పుతోళ్ల బాలాజీ, వేముల బ్రహ్మయ్య, సాంబశివరావు, గురువులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దూండి రాకేష్

ఆర్యవైశ్యుల ఓటు అడిగే హక్కు వైసీపీకి లేదు

- టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు దూండి రాకేష్

పిడుగురాళ్ల, మే 5: రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఓట్లు అడిగే హక్కు జగన్‌కు, వైసీపీ నేతలకు లేదని టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం అధ్యక్షుడు దూండి రాకేష్ తెలిపారు. ఆదివారం రాత్రి పిడుగురాళ్లలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘనలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో దూండి రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఆర్యవైశ్యుల ఆస్తులను కబ్జా చేయడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా తీసుకోనటువంటి దౌర్భాగ్యస్థితి నియోజకవర్గంలో జరిగాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల ప్రాంతాలలో ఆర్యవైశ్యుల ఆస్తులను రక్షించుకోవడం, వారు పడ్డ శ్రమ అంతా ఇంతా కాదని, ఆస్తుల వద్ద బోర్డులు పెట్టి స్థలాలు కాపాడుకోవాల్సిన దుస్థితి కాసు మహేష్ రెడ్డి వలన కలిగిందన్నారు. గురజాలలో మీ అందరికీ అండగా వుంటూ, ఏ అవసరం వచ్చినా నేనున్నాననే భరోసా ఇచ్చే యరపతినేనిని, ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలుని అధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు.

గుంటూరు మీదగా భువనేశ్వర్ - ఎల్‌టీటీ రైలు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్ - ఎల్‌టీటీ ప్రత్యేక రైలుని గుంటూరు మీదగా నడిపేందుకు తూర్పు కోస్తా రైల్వే నిర్ణయించింది. నెంబరు. 08420 భువనేశ్వర్ - ఎల్‌టీటీ వేసవి ప్రత్యేక రైలు ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 26వ తేదీ వరకు ప్రతీ బుధవారం రాత్రి 11 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.55కి గుంటూరు, రాత్రి 7.20కి సికింద్రాబాద్, శుక్రవారం ఉదయం 10.30కి ఎల్‌టీటీ చేరుకొంటుంది. అలానే నెంబరు. 08419 ఎల్‌టీటీ - భువనేశ్వర్ వేసవి ప్రత్యేక రైలు ఈ నెల 10 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.40కి గుంటూరు, ఆదివారం వేకువజామునకు ముందు 1.45కి భువనేశ్వర్ చేరుకొంటుంది.

గోల్కొండ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ మెయిన్‌టెనెన్స్ వర్కులు కారణంగా గుంటూరు - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - గుంటూరు వయా కాజీపేట ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని ఏప్రిల్ 29 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు, తిరిగి 16 నుంచి 22వ తేదీ వరకు రద్దు చేసినట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ తెలిపారు. అలానే ఇరువైపులా గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని కూడా ఏప్రిల్ 29 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు, తిరిగి 16 నుంచి 22వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	144, 153,164
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



బాపట్ల సీబీజెడ్ చర్చిలో సంఘస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ

సేవలే అందిస్తాను.. రాజకీయాలు చేయను

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, మే 5 : మూడున్నర దశాబ్దాలపాటు ఐపీఎస్ అధికారిగా ఉమ్మడి తెలుగురాష్ట్ర ప్రజలకు విశేష సేవలందించిన తాను కేవలం ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే రాజకీయాలలోకి వచ్చానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులు, పార్టీశ్రేణులతో కలిసి ఆదివారం చర్చిలలో నిర్వహించే ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మతో కలిసి ప్రార్థనలు చేశారు. పట్టణంలోని అనేక చర్చిలలో నిర్వహించిన ప్రార్థనలలో పాల్గొన్న ఆయన సీబీజెడ్ చర్చిలో సంఘస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సేవను నమ్ముకున్న వ్యక్తిగా దేవుని ప్రేమను అందరికి పంచుతానని హామినిచ్చారు. ఎప్పుడూ ప్రజల కోసమే పని చేశానని చెప్పారు. ఎవరిపై ఒత్తిడి తేనని బాపట్లలోనే ఉంటూ ప్రజలకు విస్తృత సేవలందించటంతోపాటు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి అందించే విధంగా కృషి చేస్తానన్నారు.

నమ్మకంగా పనిచేస్తా : వేగేశన నరేంద్రవర్మ

నియోజకవర్గ ప్రజలకు నమ్మకంగా పని చేస్తూ విశేష సేవలందిస్తానని టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. బాపట్ల సీబీజెడ్ చర్చిలో ఆదివారం ప్రార్ధనలో పాల్గొన్న ఆయన సంఘస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో తాను చేస్తున్న సేవలకు ప్రజలు నుంచి మంచి ఆదరణ లభిస్తున్నదన్నారు. ఇదే ప్రేమను ఎన్నికలలో కూడా చూపించి తమకు మద్దతు తెలియజేయాలని కోరారు. అనంతరం దైవసేవకుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని గెలుపుకోరుతూ ప్రార్ధనలు చేశారు.

బాపట్ల అసెంబ్లీ అభ్యర్థులతో పౌరసమైక్య సమావేశం

బాపట్లరూరల్, మే 5 : బాపట్ల అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులతో బాపట్ల పౌరసమైక్య ఆధ్వర్యంలో సమైక్య సభ్యులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సమైక్య సభ్యులు అడిగిన ప్రశ్నలకు అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు ఈవిధంగా సమాధానం ఇచ్చారు. ముందుగా బాపట్ల టీడీపీ, బీజేపీ, జనసేనపార్టీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్లలో ఉన్న తాగునీటి చెరువుతోపాటు అదనంగా మరో తాగునీటి చెరువు ఏర్పాటు చేయటంతోపాటు పైపులైన్ కూడా నూతనంగా ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో బాపట్లలో కళాకారులను ప్రోత్సహించేందుకు ఇండోర్ ఆడిటోరియం ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. వర్షాల సమయంలో నల్లమడవాగు వరద ముంపునకు గురవుతున్నదని అధికారంలోకి రాగానే ఇంజనీర్ల పర్యవేక్షణలో మరమ్మతులు చేపడతానన్నారు. సమావేశంలో వైసీపీ ఎమ్మెల్యే, అభ్యర్థి కోన రఘుపతి మాట్లాడుతూ రాబోయే కాలంలో కోన ప్రభాకరరావు కళాక్షేత్రం ఆవరణలో ఇండోర్ ఆడిటోరియంను కూడా ఏర్పాటు చేస్తానన్నారు. జి.రాజారావు మాట్లడుతూ గ్రామాలలో పాడి పరిశ్రమలను అభివృద్ధి చేయటం ద్వారా రైతులు పంట పొలాలలో రసాయనాల వాడకం తగ్గించవచ్చు అని తెలిపారు. జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుద్యోగులకు బాపట్లలో ఉచితంగా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. పౌరసమైక్య సభ్యులు విజయ్‌కుమార్, ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

767 ఓట్లు వినియోగించుకున్న ఉద్యోగులు



ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న నరేంద్రవర్మ

బాపట్ల,మే 5 : ఎన్నికల విధులకు హాజరుకానున్న ఉద్యోగులకు నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కార్యక్రమాన్ని ఆదివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో నిర్వహించారు. మొదటిరోజు ఓపిఓలకు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో మొత్తం 8 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 837 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా నిర్ణయించిన సమయానికి 767 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలినవారు సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. వీటితోపాటు పిఓలు కూడా సోమవారం ఓటు వేయనున్నారు. రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ సిబ్బందితో కలిసి పోలింగ్ నిర్వహించగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతితోపాటు బహుజనసమాజ్‌పార్టీ అభ్యర్థి గుదే రాజారావు, విసికెపార్టీ అభ్యర్థి రేగులగడ్డ చంద్రశేఖరరావు, సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి గొర్ల శ్రీనివాసరావులు పోలింగ్ సరళిని పరిశీలించారు. డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ యు.శ్రీనివాసులు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా పార్టీల నాయకులు బయట చేరటంతో పోలీసులు వారిని పంపించే ప్రయత్నం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టాలని చూసిన వైసీపీశ్రేణులను పంపించే ప్రయత్నంచేసినందుకు సీఐపై వారు దురుసుగా ప్రవర్తించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద తిష్ట వేసిన వైసీపీ నాయకులు

బాపట్లలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు తిష్ట వేశారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఓపిఓలు పోస్టల్ ఓటు హక్కు వినియోగించుకోవటానికి కేంద్రంలోకి వెళుతున్న ఉద్యోగులను వైసీపీ అభ్యర్థి కోన రఘుపతి అనుచరులు ప్రలోభాలకు, ఒత్తిళ్ళకు గురి చేస్తున్నారు. ఆయా పోలింగ్‌కేంద్రం వద్ద టీడీపీ, జనసేన నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష కూటమి నాయకులు చెబుతున్నారు. పోలీసులు ప్రతిపక్ష పార్టీలపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.

రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్

రేపల్లె మే, 5 : తీర ప్రాంతంలోని రేపల్లె పట్టణంలో సిబ్బంది ఆలస్యంగా రావటంతో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభం కావటంతో వివిధరకాలు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారులు అలసత్వం కారణంగానే ఈ విధంగా జరిగిందంటూ ఉద్యోగులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకపల్లిలోని ఆర్.సి కళాశాలలో ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కావల్సిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అధికారులు ఆలస్యంగా రావటం, ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని ఆలస్యంగా తీసుకోవటంతో 11.30 గంటలకు పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. రెండు గంటల పాటు ఓట్లు వేయటానికి వచ్చిన ఉద్యోగస్తులు చెట్ల క్రింద, పోలింగ్‌బూత్‌ల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటమే దీనికి ప్రధాన కారణం. కనీసం పోలింగ్‌బూత్‌ల వద్ద మంచినీరు కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు.

వేమూరులో 90శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



వేమూరులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు

వేమూరు, మే 5: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో ఆదివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 90శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. కొల్లూరు, చుండూరు తహసీల్దార్ల పర్యవేక్షణలో ఉదయం 9గంటలకు ప్రారంభమైన పోలింగ్ కు గతంలో ఎన్నడూ లేని విధంగా పూర్తి అవగాహనతో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు బారులు తీరు. 749మంది ఓటర్లకు గాను 670 ఓట్లు పోల్ అయ్యాయి. వేమూరు, అమర్తలూరు, చుండూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాలకు సంబంధించి 135, 103, 200, 132, 100ఓట్లు పోలయ్యాయి. ఇంకా ఓట్లు వేయవలసినటువంటి ఓపీఓలు ఎవరైనా ఉంటే వారు సోమవారం ఓటు వినియోగించుకునేందుకు అవకాశాన్ని కల్పించారు. ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ప్రతి ఓటరుకు ఎక్కువ సమయం తీసుకోవడం జరిగింది. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలను కల్పించారు.

దేశంలో మద్యం వ్యాపారం చేస్తున్న ఏకైక సీఎం జగన్

● మాజీ మంత్రి ఆనందబాబు



ప్రచార రథంపై నుంచి ప్రసంగిస్తున్న ఆనందబాబు

చుండూరు, మే 5 : దేశంలో మరెక్కడా లేని విధంగా మద్యం వ్యాపారం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆరోపించారు. ఆదివారం తొట్టెంపూడి, మోదుకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆనందబాబు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్ మద్యం వ్యాపారం చేస్తున్నాడని అన్నారు. జే బ్రాండ్ చీప్ లిక్కర్‌ను తాగి రాష్ట్రంలో వేల మంది మృత్యువాత పడ్డారు. లక్షల మంది అనారోగ్యం పాలయ్యారు. కిళ్లీ కొట్టులో కూడా నేడు డిజిటల్ పేమెంట్లు జరుగుతున్నాయి. కానీ ప్రభుత్వ మద్యం షాపుల్లో మాత్రం డిజిటల్ పేమెంట్లకు జగన్ నో చెప్పాడు. కారణం ఈ మద్యం అమ్మకాల ద్వారా వచ్చే వేల కోట్ల రూపాయలు సాయంత్రానికి జగన్ ప్యాలెస్‌కు తరలిపోతున్నాయన్నారు. జగన్ రాష్ట్రాన్ని కబ్జాలకు, రౌడీయిజాలకు, మద్యం, గంజాయి యథేచ్ఛగా ఏరులైపారిస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగాలకు నెల నెలా జీతాలు ఇచ్చుకోలేక చివరికి విలువైన భూములు, ప్రభుత్వ కార్యాలయాలు కూడా తాకట్టుపెట్టి రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా మార్చాడు. రాష్ట్రంలో మూలధన పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనను పూర్తిగా వదిలివేశాడు. రాష్ట్రంలో విద్యావంతులైన యువత ఉపాధి కోసం రాష్ట్రం వీడి పొరుగు రాష్ట్రాల్లో జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు తుఫాన్‌కు నష్టపోతే వారికి ఎలాంటి ఆర్థిక సహాయం అందించలేదు. కేంద్రం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ఇచ్చిన రూ.6845కోట్ల నిధులను దారి మళ్ళించాడు. దీంతో గ్రామ పంచాయతీలు ఆర్థికంగా నిర్వీర్యం అయ్యాయన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి పథకం చేపట్టలేదు. దోచుకున్నంత దోచుకుని ఆరు నెలలు ముందుగానే నియోజకవర్గాన్ని వీడి పరారయ్యాడు. నియోజకవర్గంలో గతంలో టీడీపీ చేసిన పనులు తప్పితే వైసీపీ అధికారం లోకి వచ్చినాక ఒక్క పని చేపట్టలేదని ఆనందబాబు తెలిపారు. ఎన్నికల్లో కూటమి బలపర్చిన ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌కు, తనను అధిక మెజార్టీతో విజయాన్ని చేకూర్చాలని ఆనందబాబు కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొల్లూరులో ఆదివారం సాయంత్రం ఆనందబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గౌడపాలెం ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భారీగా హాజరై ఆనందబాబుకు దిష్టి తీసి హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి భారీ జన సందోహం నడుమ ప్రచార రథంలో రోడ్ షో ద్వారా ప్రజలకు అభివాదం చేస్తూ గ్రామంలో పర్యటించారు. లాకు సెంటర్ వద్ద టీడీపీ నాయకులు, అభిమానులు భారీ గజమాలతో ఆనందబాబును సత్కరించారు. ఈ సందర్భంగా ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో యువత మత్తుకు బానిసలయ్యారని, పరిశ్రమలు రానివ్వకుండా అడ్డుపడి నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా చేశాడని, సంపాదనే ధ్యేయంగా ముఖ్యమంత్రి మద్యం వ్యాపారం చేస్తున్నాడన్నారు. ఒక్క ఇసుకలోనే రూ.60 వేల కోట్లు దోచుకున్నాడని, ఆ డబ్బుతోనే ఎలాగైనా గెలవాలని చూస్తున్నాడని, అధికారంలో చేజారితే జైలుకు వెళ్లాల్సి వస్తుందన్న భయంతోనే మళ్లీ ప్రజలను మోసగించేందుకు తెరతీసి కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి గద్దెనెక్కాలని చూస్తున్నారని, అధికారం కోసం సొంత బాబాయినే హత్య చేయించడం, కోడికత్తి డ్రామాలు ఆడాడని సొంత చెల్లెలే ఆరోపణ చేయడం చూశామన్నారు. మళ్లీ జగన్ మాటలకు మోసపోతే ప్రజలకు, రాష్ట్రానికి భవిష్యత్ లేకుండా పోతుందన్నారు. విజన్ ఉన్న చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ తోడు అయ్యాడని వారిద్దరి సారథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ మళ్లీ పురోభివృద్ధిలోకి రావాలని, ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో జగన్‌కు బుద్ధి చెప్పాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందబాబుకు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. లూథరన్ చర్చిలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన విజయం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసి శాలువాలతో సత్కరించారు. ప్రచార కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, జిల్లా నాయకురాలు సోమరౌతు అనురాధ, టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, జొన్నలగడ్డ విజయబాబు, యలవర్తి కోటేశ్వరరావు, సుంకర రాంబాబు, జివిఎల్‌జి భగవాన్, కొత్తపల్లి మధు, కోగంటి హరిబాబు, కాసరనేని మోహన్, గుమ్మడి శివ, గద్దె నాగేశ్వరరావు, గోగినేని వెంకటేష్, వెలివెల శ్రీరాములు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు బొందలపాటి చలమయ్య, నాయకులు వెలివెల రత్తయ్య, సుబ్రహ్మణ్యం, సమ్మెట దుర్గాప్రసాద్, టీడీపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.



లూథరన్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న ఆనందబాబు

ఆర్థిక నేరగాడు, ఉగ్రవాది, ఫ్యాక్షనిస్టు జగన్

● మాజీ మంత్రి, కూటమి అభ్యర్థి ఆనందబాబు

కొల్లూరు, మే 5 : ఆర్థిక నేరగాడు, ఉగ్రవాది, ఫ్యాక్షనిస్టు జగన్ అధికారం కోసం ఎన్ని డ్రామాలైన ఆడతాడు. ఎంతకైనా తెగిస్తాడని మాజీ మంత్రి, టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు ఆరోపించారు.

చిరువ్యాపారులకు తోడుగా ఉంటా

● రైతులను అన్నివిధాలా ఆదుకుంటా

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన



మార్కెట్‌లో కూరగాయలు తూకం వేస్తూ, పీర్ మటన్ దుకాణంలో కైమా కొడుతున్న నరేంద్రవర్మ

బాపట్ల, మే 5 : వ్యాపారులు, చిరువ్యాపారులు, రైతులు, రైతు కూలీలను పలకరించుకుంటూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆదివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా బాపట్ల ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. కూరగాయలు, చేపలు, మాంసం విక్రయిస్తున్న వారి వద్దకెళ్ళి వారి కష్టాన్ని తెలుసుకొని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామినిచ్చారు. తన విజయానికి ప్రతి ఒక్కరు దోహదపడాలని అభ్యర్థించారు. రైతులకు మేలు చేస్తానని చిరువ్యాపారుల కోసం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతుబజారును తిరిగి ప్రారంభించి వారికి అంకితం చేస్తానన్నారు. ఏ ఒక్కరు ఇబ్బంది పడకుండా తోడుగా ఉంటానని హామినిచ్చారు. కాయకూరలు కాటావేస్తూ, చేపలు విక్రయిస్తూ, చికెన్ స్టాల్‌లో చికెన్ కొడుతూ జమేదారుపేటలో పీర్ మటన్ దుకాణంలో కైమా కొడుతూ ఆకట్టుకునేవిధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిరునవ్వుతో పలకరిస్తూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు గొలపల శ్రీనివాసరావు, ఎం.ఎస్.శేషు, పులి వాసు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, బూర్లె రామసుబ్బారావు, సోమయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతిసమస్యకు పరిష్కారం తెలుగుదేశంతోనే సాధ్యం : వేగేశన

బాపట్ల, మే 5 : పట్టణంలో నెలకొనియున్న ప్రతి సమస్యకు పరిష్కారం తెలుగుదేశంతోనే సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 4, 5, 6 వార్డులలో నరేంద్రవర్మ విస్తృతంగా పర్యటించారు. అడుగడుగున మహిళలు హారతులు పడుతూ, విజయ తిలకం దిద్దుతూ నరేంద్రవర్మకు ఘనస్వాగతం పలికారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళా సాధికారితకు కృషి చేస్తామని ఆయన హామినిచ్చారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకొని తాగునీరు, వీధిలైట్లు, డ్రైనేజిలు ప్రక్షాళన చేసి దోమల నివారణకు చర్యలు తీసుకుంటానని హామినిచ్చారు. నిరుద్యోగ యువతకు ఉపాధికల్పన విషయంలో ప్రత్యేక దృష్టిసారిస్తానని నరేంద్రవర్మ స్పష్టం చేశారు. బాపట్ల ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, మహిళానాయకురాలు జి.గిరిజారాణి, పరిశా రమేష్, తాతా చినబాబు, విన్నకోట వీరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చందోలులో నరేంద్రవర్మ రోడ్‌షో

పిట్టలవానిపాలెం, మే 5 : మండలంలోని చందోలుగ్రామపంచాయతీలోని నదిముల్లాపాలెం, కత్తివారిపాలెం, చందోలుసెంటర్ గ్రామకూడళ్లలో ఆదివారం విశేష జనవాహినితో మధ్య నరేంద్రవర్మ భారీగా నిర్వహించిన రోడ్‌షోలో చందోలు సెంటర్ కిటకిటలాడింది. కూటమిపార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుమహిళలు, చందోలు గ్రామపంచాయతీలోని తెలుగుయువత ద్విచక్రవాహనాలతో భారీగా ర్యాలీ నిర్వహించారు. చందోలుగ్రామ ముస్లింలు, మహిళలు, గ్రామస్తులు, పార్టీనాయకులు అభిమానులు ఘనస్వాగతం పలికారు. చందోలు కూడలిలో జరిగిన రోడ్‌షోలో నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎన్నికల్లో తనను, పార్లమెంట్ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్‌లకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు ఎండి అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్‌సోపాటి, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ ఖాసీం, ప్రధాన కార్యదర్శి సయ్యద్ జునేద్, చందోలుగ్రామ టీడీపీ అధ్యక్షులు మహ్మద్ రజాక్, చందోలు గ్రామ టీడీపీ యువనాయకులు సయద్ నిజాం, ఎస్ఎమ్ నియాజి, అబ్దుల్ రహీం, ఖాజా, టీడీపీ సీనియర్‌నాయకులు కనుమూరి సాంబమూర్తిరాజు, లక్ష్మంరాజు వెంకటపతిరాజు, మోదుగుల శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బొలగాని సులోచన నారాయణ, జాలాది లోకరాజ్యుడు, మండల,గ్రామటీడీపీనాయకులు తదితరులు పాల్గొన్నారు.



చందోలు రోడ్‌షోలో మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ

రాష్ట్రాభివృద్ధే తెలుగుదేశం పార్టీ ధ్యేయం

● ప్రజలు ఏన్డీయే కూటమికి మద్దతునివ్వాలి

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లెలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌ని గజమాలతో సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

రేపల్లె, మే 5: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం చినమట్లపూడి, పూడివాడ గ్రామాల్లో టీడీపీ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఐదేళ్ళ పాలనలో ప్రజలంతా అష్టకష్టాలు పడ్డారన్నారు. పథకాల పేరుతో ప్రజలను నట్టేటముంచారన్నారు. వైసీపీ పాలన లో దోచుకో దాచుకో అన్న చందాన వ్యవహరించారని, పేద, మధ్యతరగతి కుటుంబాలపై అధిక భారాన్ని మోపారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేశారని, మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను విడకొట్టారన్నారు. యువత ఉద్యోగావకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే యువత ఉద్యోగావకాశాలతో పాటు ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అం దిస్తూ ప్రజాసంక్షేమ పాలనను అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతల సుబ్బారావు, మాన్యం నాగమణి, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, విచారపు వీరయ్య, అబ్దుల్ మునాఫ్, కరీం, గుడారంకయ్య, మత్తి భాస్కరరావు, కేసనరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పూడివాడలో ఎమ్మెల్యే అనగానికి హారతులు ఇస్తున్న మహిళలు

పార్టీ గెలుపు కోసం కృషి చేయండి : అనగాని



దిండి పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని

రేపల్లె మే 5 : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిజాంపట్నం దిండి గ్రామానికి చెందిన నర్రా సోమయ్య, నాగరాజు, రవీంద్ర, పెనుమూడి గ్రామానికి చెందిన మీరా, అంకరాజు, నరసింహా, శివయ్య, కన్నా శ్రీనివాసరావు, అరవపల్లికి చెందిన ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు భూపతి హరిప్రసాద్, శ్రీరామయ్య, అల్లంశెట్టి ప్రసాద్, భూపతి కిరణ్, పినాకపాణి, శంకర్ తదితరులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 8 రోజుల పాటు కష్టపడి పనిచేయాలని మీకు నేను అండగా ఉంటానని హామీ ఇచ్చా రు. ఈ కార్యక్రమంలో పంతాని మురళీధరరావు, రేపల్లె రామాంజనేయులు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం

● మాజీ మంత్రి కూటమి అభ్యర్థి ఆనందబాబు



ముస్లింల ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఆనందబాబు

వేమూరు, మే 5: తెలుగుదేశం పార్టీ హయాంలో రాష్ట్రంలోని ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చామని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు తెలిపారు. ఆదివారం తెనాలిలోని ఓ హోటల్‌లో నియోజకవర్గ ముస్లిం పెద్దల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ఇమాములు మౌజన్లు పాల్గొన్నారు. వారంతా సామూహిక ప్రార్థన ద్వారా ఆనందబాబును ఆశీర్వదించి సత్కరించారు. ఆనందబాబు మాట్లాడుతూ టీడీపీ పాలనలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముస్లింలకు ప్రత్యేక స్థానం కల్పించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రంజాన్ తోఫా, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా పేద ముస్లింలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేశారన్నా రు. ప్రతి మండలంలో షాదీఖానాలు ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో మసీదుల అభి వృద్ధి నిమిత్తంగా ఒక్కొక్క మసీదుకు 20వేలు మంజూరు చేశామన్నారు. షాదీ ముబారక్ పథకం ద్వారా పేద ముస్లింలకు రూ.50 వేలు అందించామన్నారు. విదేశీవిద్య పథకం ద్వారా ముస్లిం విద్యార్థులను రాష్ట్ర వ్యాప్తంగా 577మందికి ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున మంజూరు చేసి విదేశాలకు పంపేందుకు ప్రోత్సహించామన్నారు. వేమూరు నియోజకవర్గంలోని 17 మసీదుల్లో ప్రార్థనలు చేసి ఇమాములకు ఒక్కొక్కరికి నెలకు రూ.5వేలు మౌజన్లకు ఒక్కొక్కరికి రూ.3వేల గౌరవ వేతనం అందించామన్నారు. టీడీపీ లౌకికవాద పార్టీ అని ముస్లింల హక్కులకు ఎక్కడ భంగం కలగకుండా వారి మనోభావాలను గౌరవిస్తామన్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు మొజాయిద్, షేక్ రషీద్, షేక్ బుజ్జిజాన్‌సైదా, మౌలాలి, షేక్ ఖాశింఖాన్ తదితరులు మాట్లాడుతూ ఆనంద్‌బాబుకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

టీడీపీలో చేరిన హైకోర్టు న్యాయవాది



ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన హైకోర్టు న్యాయవాది పాల్‌ప్రసాద్

వేమూరు, మే 5 : మండలంలోని జంపని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హైకోర్టు న్యాయవాది జంపని పాల్‌ప్రసాద్ ఆదివారం టీడీపీలో చేరారు. వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు సమక్షంలో పార్టీలో చేరిన ఆయనకు కండువా కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, ఎస్సీ సెల్ నాయకులు వట్టిప్రోలు యోబు, వేల్పుల రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికే సూపర్ సిక్స్ పథకాలు



సూరేపల్లిలో టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న డాక్టర్ అఖిలేష్

భట్టిప్రోలు, మే 5: అన్ని వర్గాల సంక్షేమం కోసమే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమల్లోకి తీసుకువచ్చారని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ నక్కా అఖిలేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సూరేపల్లిలో ఆదివారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి నక్కా ఆనందబాబు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని గుర్తించి ఆయనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సూరేపల్లి పంచాయతీ వేమవరంలో 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరగా డాక్టర్ అఖిలేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు గోవర్ధనగిరి సుధాకర్, చోడాబత్తుని పాపారావు, తలకాయల రత్నరాజు, దుర్గారావు, గుర్రం నాని, యరగళ్ళ సాంబ య్య, బొర్రా శరాబంది, బొర్రా శేషగిరిరావు, గోవర్ధనగిరి నవీన్, రవిచంద్ర పాల్గొన్నారు.

టీడీపీ కూటమికి మద్దతు ఇవ్వాలి

● అనగాని మంజుల, కమల



విక్టరీ సింబల్ చూపిస్తున్న డాక్టర్లు మంజుల, కమల, కార్యకర్తలు

రేపల్లె, మే 5: టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పేద మహిళలు ఆర్థికంగా, శక్తివంతులవుతారని ఎమ్మెల్యే అనగాని సోదరీలు, డాక్టర్లు మంజుల, కమల అన్నారు. ఆదివారం నగరం మండలం సజ్జావారిపాలెంలో అనగాని గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్భుతమైన సంక్షేమ పథకాలను అప్పులు చేయకుండా సంపద సృష్టించి అందించే అనుభవం కలిగిన సమర్థవంతులైన నాయకులు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌ల నాయకత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేసన వాసు, దండమూడి ధరణికుమార్, కవితా సాగర్, వర్ధిని, తుమ్మల విజయశాంతి, హైమా పాల్గొన్నారు.

వైభవంగా జిల్లెళ్ళమూడి అమ్మ, నాన్న కల్యాణ మహోత్సవం

బాపట్లరూరల్, మే 5 : మండలంలోని జిల్లెళ్ళమూడిలో ఉన్న అమ్మ కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మ, నాన్న విగ్రహాల ఊరేగింపుతో ప్రారంభమై భక్తజనసందోహం మధ్య వేదమంత్రోచ్ఛరణలతో అంగరంగవైభవంగా కల్యాణోత్సవం జరిగింది. మహాసంకల్పం, జీలకర్రబెల్లం, మంగళ్యసూత్రధారణ వేదోక్తంగా అర్చకస్వాములు నిర్వహించారు. జిల్లెళ్ళమూడిలో సామూహిక ఉపనయన కార్యక్రమాలు వివిధప్రాంతాలు నుంచి అనేక రాష్ట్రాలు నుంచి విచ్చేసి అమ్మసన్నిధిలో ఉపనయనాలు జరిపించుకోవటం విశేషం. అనంతరం భక్తులు అమ్మవారి అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో విశ్వజననీపరిషత్ ఛైర్మన్ వీఎస్ఆర్ మూర్తి శ్రీ అనసూయేశ్వరాలయంలో వేద ఆశీర్వచనాల మధ్య పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విశ్వజననీ పరిషత్ ట్రస్ట్ ప్యాట్రిన్ బ్రహ్మాండం రవీంద్రరావు, సభ్యులు దినకర్, గిరిధర్ కుమార్, రామబ్రహ్మం, ధర్మసూరి, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


తుమ్మల ఎస్ఆర్ కాలనీలో యానాదులకు నిర్మించిన పక్కా గృహ సముదాయం

ఆనందబాబు.. అభివృద్ధికి చిరునామా


దోనేపూడి వద్ద రైతుల కోసం నిర్మించిన పోతార్లంక ఎత్తిపోతల పథకం


ఆనందబాబు హయాంలో నిర్మించిన వ్యవసాయ సహకార పరపతి సంఘం



- 2014-19 కాలంలో పరుగులు పెట్టిన అభివృద్ధి పథకాలు
- రూ.100 కోట్ల సబ్‌ప్లాన్ నిధులతో ఎస్‌సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు
- గ్రామ గ్రామాన ఆనందబాబు చేసిన అభివృద్ధి శిలాఫలకాలు
- ఇప్పటికీ ఆయన చేసిన అభివృద్ధిని చెప్పుకుంటున్న ప్రజానీకం

కొల్లూరు, మేే5: అభివృద్ధి అంటే ఆనందబాబే అనే నానుడి ప్రజల్లో నాటుకుపోయింది. అధికార దర్పం చూపకుండా అభివృద్ధే తన బాటగా వేసుకున్న వ్యక్తి నక్కా ఆనందబాబు అని ఇప్పటికీ ప్రజలు చెప్పుకోవడం గమనార్హం. ఎమ్మెల్యేగా, మంత్రిగా పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేశారనే భావన ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం చెప్పుకోవడమే ఇందుకు నిదర్శనం. 2009లో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించి ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగు పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సైతం తనదైన శైలిలో అభివృద్ధి పథంలో నడిపించారు. 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైన ఆయన వేమూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించి కొత్త హంగులు తీసుకు వచ్చారు. 2014, 2019 కాలంలో ముఖ్యంగా కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో రైతులు ఉప్పునీటితో వ్యవసాయం చేయలేక నష్టాలు చవి చూస్తుండం ఆయన ప్రత్యక్షంగా చూడటంతో వారి కష్టాలు తీర్చేందుకు పోతార్లంక ఎత్తిపోతల పథకాన్ని పునఃనిర్మాణం చేయించేందుకు నడుం కట్టారు. రైతుల కష్టాలను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి నాబార్డు నిధులు రూ.49.95 కోట్లతో ఎత్తిపోతల పథకం శంకుస్థాపన చేయించారు. 2018 కాలం నాటికి పథకాన్ని పూర్తి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రారంభోత్సవం చేయించి రేపల్లె బ్యాంకు కెనాల్ ద్వారా సాగునీరు అందించిన ఘనత ఆయనకే దక్కింది. మరోవైపు వందలాది కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేశారు. తనను ఆదరించని గ్రామాల్లో సైతం వివక్ష చూపకుండా అభివృద్ధే లక్ష్యంగా పనిచేశారు. 2009, 2014 సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని తాడిగిరిపాడు గ్రామస్తులు ఆయనకు ఓట్లు వేయకపోయినా వారు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలను గుర్తించి రూ.30 లక్షల పైచిలుకు నిధులతో మంచినీటి పథకం ట్యాంకు నిర్మాణం చేయించారు. రూ.1.18 కోట్లతో గ్రామం మొత్తం సీసీ రోడ్లు వేయించి అభివృద్ధే తన నైజమని నిరూపించుకున్నారు. 2016లో కృష్ణానది పుష్కరాలు పురస్కరించుకుని ఒక్క కొల్లూరు మండలానికే రూ.150 కోట్ల నిధులు మంజూరు చేయించి కృష్ణానది పరివాహక గ్రామాల్లో పుష్కర ఘాట్‌లు నిర్మించి ఆయా గ్రామాల్లో రహదారులను పునః నిర్మింపజేశారు. మండల గ్రామాల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో అదనపు తరగతి భవనాల కోసం నిధులు మంజూరు చేయడంతో పాటు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఈపూరు, గాజుల్లంక, చిలుమూరు, ఈపూరులంక, సుగ్గునలంక గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ భవనాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మాణం చేయించారు. సబ్‌ప్లాన్ నిధులతో ఎస్‌సీ కాలనీల్లో మొత్తం సీసీ రోడ్లుగా మార్చారు. క్రాప, గాజుల్లంక, దోనేపూడి గ్రామాల్లో వ్యవసాయ సహకార పరపతి సంఘాల కార్యాలయ భవనాలను రూ.కోటితో నిర్మాణం చేయించారు. మండలంలోని ప్రతి దళితవాడలోనూ రూ.30 లక్షల నుంచి రూ.3 కోట్ల మేర నిధులు వెచ్చించి బురదమయంగా ఉన్న రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించి ఎస్‌సీ కాలనీలను అభివృద్ధి పథంలో నిలిపారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.15 కోట్లు మంజూరు చేయించి లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఇందులో సుమారు రూ.5 కోట్లు కొల్లూరు మండలానికే మంజూరు చేయించి అనారోగ్యంతో ఉన్న లబ్ధిదారులను ఆర్థికంగా ఆదుకున్నారు. ఆయన చేసిన సేవలను ప్రజలు ఇప్పటికీ మరువకపోవడం గమనార్హం.

2024లో కూటమి అభ్యర్థిగా మండల గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రతి చోట అడుగడుగునా జనం నీరాజనాలు పలుకుతున్నారు. అప్పుడు చేసిన అభివృద్ధి మినహా ఈ ఐదేళ్ల మా గ్రామాల్లో ఒక్క పని కూడా ఈ ప్రభుత్వ హయాంలో జరగలేదని మళ్లీ మిమ్మల్నే గెలిపించుకుంటామని తమ గ్రామాల అభివృద్ధి మీరే చేయాలని ప్రచారంలో ఆయనకు ప్రజలు విన్నవించుకుంటున్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వేమూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యేగా ఆనందబాబు విజయం సునాయాసమని, కొల్లూరు మండలంలోని సుమారు 7 వేల పైచిలుకు మెజారిటీతో గెలిపించుకుంటామని మండల గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. మిగిలిన నాలుగు మండలాల్లో కూడా ఇదే తరహాలో అభివృద్ధి పనులు చేయడం వల్ల ఆయా మండలాల్లో సైతం ఆనందబాబుకు భారీ మెజారిటీ వస్తుందనే సంకేతాలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

గిరిపుత్రుల సొంతింటి కల సాకారం

- నెరవేరిన నాలుగు తరాల కల
- ఎస్టీలకు భరోసానిచ్చిన టీడీపీ ప్రభుత్వం

రేపల్లె, మే 5: గిరిపుత్రుల సొంతింటి కలను తెలుగుదేశం ప్రభుత్వ సహకారంతో నెరవేర్చారు. ఎక్కడో మట్టి డొంక మార్జిన్‌లో చుట్టూ గుడిసెల్లో భయంభయంగా రోజులు గడుపుతున్న నియోజకవర్గంలోని 250మంది ఎస్టీ కుటుంబాలకు ఇళ్ళ స్థలాలు కేటాయించి గృహాలను నిర్మించి లబ్ధిదారులకు అందించారు. రేపల్లె మండలం తుమ్మల పంచాయితీలోని 39 కుటుంబాల గిరిజనులకు ఎస్టీ కాలనీలో ఇళ్ళ స్థలాలు ఇచ్చారు. అంతటితో విడిచిపెట్టకుండా ఎన్టీఆర్ గ్రామీణ హౌసింగ్ స్కీమ్‌లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ 39 పక్కా గృహ నిర్మాణాలకు మంజూరు ఇచ్చారు. తుమ్మల గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది గరికపాటి నారాయణ దొర యానాదులపై మక్కువతో తమ పొలాన్ని ప్రభుత్వ ధరకు ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహకల్ప కింద ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ 39 గృహాలు మంజూరు చేయించి నిర్మించారు. రహదారులకు ఆరు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. తమంత తాముగా ఇళ్ళు కట్టుకునే స్తోమత లేని గిరిజనులకు విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ బాసటగా నిలిచింది. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం కింద ప్రభుత్వం అందించిన నిధులకు తోడు ఎమ్మెల్యే అనగాని నిధులు, తమ సొంత నిధులను జోడించి వీఆర్వో సంస్థ ఇళ్ల సముదాయం నిర్మించింది. గృహ సముదాయ నిర్మాణానికి ముందు పల్లంగా ఉన్న ఇళ్ళ స్థలాలను మెరక చేయడం, రోడ్లకు మట్టితోలటం, ప్రతి కుటుంబానికి మరుగుదొడ్లు నిర్మించటం పనులను నిర్వహించారు. గృహాలను లబ్ధిదారులకు అందించారు. మాకు సొంతింటిని అందించి మా జీవితాలకు భరోసానిచ్చిన ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ ప్రభుత్వానికి అండగా ఉంటామని గిరిపుత్రులు తెలుపుతున్నారు.

ఎస్టీలకు ఎన్టీఆర్ భరోసా గృహాలు..

నగరం మండలంలో 33 గృహాలు, సీసీ రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మించి గిరిపుత్రులకు అందించారు. రేపల్లె మండలం తుమ్మల ఎస్టీకాలనీలో 39, పోటుమెరకలో 54 గృహాలు నిర్మించి లబ్దిదారులకు అందించారు. నగరం మండలం నగరం ఎస్టీకాలనీలో ఇళ్ళుకాలిపోయిన వారికి 101 గృహాలు నిర్మించి వారికి అందించారు. నిజాంపట్నం మండలం గరువుపాలెం, కళ్ళిఫలంలో 22 పక్కా గృహాలు మంజూరు చేసి నిర్మించి లబ్ధిదారులకు అందచేశారు.


పోటుమెరక ఎస్టీ కాలనీలో యానాదులకు నిర్మించిన పక్కా గృహ సముదాయం

సొంతింటి కల నెరవేరింది..



తమకు సొంతంగా ఓ గృహాన్ని ఏర్పాటు చేసుకోవాలనే కల ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సహకారంతో నెరవేరిందని మర్రి నాగేశ్వరరావు తెలిపారు. ఎనిమిది నెలల వ్యవధిలోనే పక్కా గృహ సముదాయాన్ని నిర్మాణం చేయించినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మా జీవితాలకు భద్రత కల్పించారు..



ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ గట్లపై చిన్నచిన్న గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న తమకు పక్కా గృహాలు నిర్మించి భద్రత కల్పించారని చేవూరి తిరుపతమ్మ తెలిపారు. తెచ్చుకున్న వస్తువులు దాచుకునేందుకు కూడా తగిన ఇల్లు లేక అవస్థలు పడ్డాం. మా జీవితాలకు భద్రత కల్పించిన ఎమ్మెల్యే సత్యప్రసాద్‌కు రుణపడి ఉంటామన్నారు.

టీడీపీ.. జోష్

- బాపట్లలో కలిసి వచ్చిన వలసలు
- పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో మెజార్టీ ధీమా


ఎన్నికల ప్రచారంలో నరేంద్రవర్మకు స్వాగతం పలుకుతూ అనుసరిస్తున్న కార్యకర్తలు అభిమానులు

బాపట్ల, మే 5: బాపట్ల తెలుగుదేశంపార్టీ శ్రేణులలో జోష్ పెరిగింది. ఎన్నికల సమీపిస్తుండగా పార్టీశ్రేణులు క్రమశిక్షణతో కష్టపడి పనిచేస్తూ గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ జనసేన, బీజేపీశ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళుతున్నారు. దీనికితోడు ఎమ్మెల్యే కోన రఘుపతికి వ్యతిరేకంగా ఉన్నవారందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి మద్దతు కూడగట్టారు. దీంతో వైసీపీ నుంచి పెద్దఎత్తున టీడీపీలోకి వలసవచ్చారు. నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓటర్లుగా ఉన్న రెడ్డి సామాజికవర్గాన్ని ఎమ్మెల్యే కోన నిర్లక్ష్యం చేశారని కారణంతో ఆపార్టీని వీడి మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డితోపాటు ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించిన కళ్ళం హరినాథరెడ్డి, కర్లపాలెం జడ్పీటీసీ మెంబరు పిట్టు వేణుగోపాలరెడ్డిలు తమ అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. అదేవిధంగా ఎమ్మెల్యే కోనకు అత్యంత ముఖ్యునిగా, వైసీపీ పట్టణాధ్యక్షుడిగా ఉన్న మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాష్‌తోపాటు పలువురు మాజీ కౌన్సిలర్లు, ముఖ్యనాయకులు కూడా నరేంద్రవర్మ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈవిధంగా వైసీపీ శిబిరంలో ఉన్న ముఖ్యనాయకులంతా ఖాళీ చేసి టీడీపీలోకి వచ్చారు. దీంతో నరేంద్రవర్మ బాపట్లలో టీడీపీ బావుటా ఎగురవేస్తామనే ధీమాతో ఉన్నారు. దీనికితోడు ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో అత్యధిక ఓటర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా, తెలుగుదేశానికి మద్దతుగా ఓట్లు వేసినట్లు బహిరంగంగా చెప్పటం టీడీపీ శ్రేణులలో మరింత జోష్‌ను నింపింది. చిన్న,పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుంటూ నరేంద్రవర్మ పార్టీని విజయం వైపు నడిపిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వైసీపీకి వ్యతిరేకంగా కసితో పని చేస్తూ విజయం తమదేనంటున్నారు. దీనికితోడు నరేంద్రవర్మ కుటుంబ సభ్యులు, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులు కూడా ఇంటింటా తిరిగి ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే నరేంద్రవర్మ గెలుపు ఖాయమని చర్చ జరుగుతోంది.


బాపట్ల రైలుపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు హారతులు పడుతున్న మహిళలు

టీడీపీ సూపర్ సిక్సర్!

- జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో టీడీపీకి సానుకూలత
- ఎదురీదుతున్న వైసీపీ, చేరికల పర్వాన్ని ఆపడానికి నానా అగచాట్లు
- బాపట్ల పార్లమెంట్ స్థానంలోనూ అదే జోరు
- ప్రభుత్వ వైఫల్యాలే అజెండాగా జనంలోకి అభ్యర్థులు
- కలిసొస్తున్న కూటమినేతలతో సమన్వయం

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలతో పాటు బాపట్ల పారమెంట్ స్థానంలో కూడా టీడీపీ అనుకూల ఫలితాలు వస్తాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. వేమూరు బరిలో ఉన్న మాజీమంత్రి నక్కా ఆనందబాబు తాను మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులను జనాలకు వివరిస్తూ తనకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. పర్చూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఏలూరి హ్యాట్రిక్ విజయం దిశగా పయనిస్తున్నారు. బాపట్ల టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఏళ్లుగా తను చేస్తున్న సేవలతో ప్రజలకు దగ్గరయ్యారు. అద్దంకి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వ చేసిన అరాచకాలు, టీడీపీ మేనిఫెస్టోనే ప్రధాన అజెండాగా చేసుకుని జనంలోకి వెళుతున్నారు. రేపల్లె టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ తన ప్రచారంలో ఎక్కువగా టీడీపీ హయాంలో ప్రజలకు జరిగిన మేలునే గుర్తు చేస్తూ ముందుకు కదులుతున్నారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో చీరాల ఇన్‌చార్జిగా నియోజకవర్గంలో అడుగుపెట్టిన ఎంఎం కొండయ్య స్వల్ప సమయంలోనే పార్టీని గాడిన పెట్టడంలో విజయం సాధించారు.

బాపట్ల, మే5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికార దుర్వినియోగం, కుట్రలు, కుతంత్రాలు అన్నింటినీ ఛేదించుకుని జిల్లాలోని ఆరు నియోజకవర్గాలతో పాటు బాపట్ల పారమెంట్ స్థానంలో కూడా టీడీపీ అనుకూల ఫలితాల దిశగా వెళుతుందన్న అంచనాలు వైసీపీని కలవరపెడుతుంన్నాయి. మరోవైపు దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వైసీపీ నుంచి టీడీపీలోకి ద్వితీయశ్రేణి నేతాగణంతో పాటు, శ్రేణులూ పెద్దసంఖ్యలో రావడం అధికారపార్టీ అభ్యర్థులను గందరగోళంలో పడేసింది. సొంతపార్టీ నుంచే సహకారం కరువవడం, ఇంకోవైపు టీడీపీ అభ్యర్థులు ప్రచారంలో అన్ని వర్గాలను కలుపుకుని వెళుతుండడంతో వైసీపీ పరిస్థితి మరింత దిగజారింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే నాటికి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీకి అనుకూలత ఉందని, రెండింటిలో నిరాశ తప్పదనే అంచనాలు వెలువడ్డాయి. కానీ కోడ్ అమల్లోకి వచ్చి ప్రచార బరిలోకి దిగడం, చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్ జిల్లాలో వరుస పర్యటనలు చేపట్టడం లాంటివన్నీ అభ్యర్థులకు కలిసొచ్చి జిల్లాలో క్లీన్‌స్వీప్ ఖాయమన్న ధీమా అటు అభ్యర్థులతో పాటు ఇటు శ్రేణులకు వచ్చింది. దీనికి తోడు రోజువారీ సమావేశాలతో టీడీపీ పెద్దలు నిత్యం అభ్యర్థులను అలెర్ట్ చేయడం కూడా కలిసొచ్చింది. ఇంకా సరిగ్గా పోలింగ్‌కు వారం రోజుల సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో టీడీపీకి సానుకూలంగా మారిన అంశాలతో పాటు వైసీపీ ఎదురీతకు గల కారణాలపై విశ్లేషణాత్మక కథనం..

వేమూరులో దోపిడీ ఇంకా జనం మెదళ్లలో...

వేమూరు నియోజకవర్గంలో అధికారపార్టీ చేసిన దోపిడీ అంతా ఇంతాకాదు. ఆ వ్యతిరేకతను తప్పించుకోవడానికే అక్కడ ఎమ్మెల్యేగా గెలిచి అమాత్యుడిగా కూడా ఉన్న వ్యక్తిని వేరే చోటకు పంపించి ఇక్కడకు పొరుగు జిల్లా నేతను అభ్యర్థిగా ప్రకటించారు. వేమూరులో సదరు నేత దోపిడీ గురించి టీడీపీ నేతలు రెండేళ్లుగా ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. సదరునేతను అక్కడ నుంచి తప్పించడంతో ప్రతిపక్ష పార్టీ ఆరోపణలను పాలకపార్టీ పరోక్షంగా ఒప్పుకున్నట్లయింది. దీనికి తోడు టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు తాను మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులను జనాలకు వివరిస్తూ తనకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. స్థానికత కూడా టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా మారాయి. మరోవైపు వైసీపీ అభ్యర్థి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యాఖ్యలు చేయడం అక్కడి ప్రజలకు మింగుడుపడడం లేదు. ప్రభుత్వ వ్యతిరేకత, కూటమి నేతల సహకారంతో వేమూరులో టీడీపీ జెండా ఎగరడం ఖాయమన్న ధీమాను పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

హ్యాట్రిక్‌పై కన్నేసిన ఏలూరి...

పర్చూరు నియోజకవర్గంలో ఎలాగైనా టీడీపీని ఓడించాలనే లక్ష్యంతో అక్కడ పాలకపార్టీ చేసిన కుట్రలు అన్నీఇన్నీ కావు. దీనికోసం ఓట్లనే పెద్ద ఎత్తున తారుమారు చేయాలనే కుట్రలకు ప్రణాళికలు రచించారు. వీటన్నింటిని ఛేదించుకుని అడుగులేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఏలూరి హ్యాట్రిక్ విజయం దిశగా పయనిస్తున్నారు. చేరికల విషయంలో జిల్లాలోనే ఎక్కువగా ఉన్న నియోజకవర్గంగా పర్చూరు నిలిచింది. పార్టీని వీడొద్దని వైసీపీ శ్రేణులను సదరు అభ్యర్థి ఎడం బాలాజీ బతిమాలుకునే స్థాయికి అక్కడ పాలకపార్టీ రావడం టీడీపీ సాధించబోయే విజయానికి సూచికగా నిలిచింది. వీటన్నింటికన్నా మించి పర్చూరు నియోజకవర్గంలో ఏదన్నా అభివృద్ధి జరిగిందంటే అది టీడీపీ హయాంలోనే అని ప్రజల్లో బలపడిపోయింది. వైసీపీ అంటేనే దోపిడీలు, ఓట్ల కుట్రలు, వేధింపులేనని అభిప్రాయం ప్రజలలో స్థిరపడిపోవడంతో వైసీపీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతున్న పరిస్థితి కనబడుతోంది. దీంతో పర్చూరులో టీడీపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయంగా కనబడుతోంది.

ఎదురీత నుంచి సేఫ్‌జోన్‌కు..

బాపట్ల అసెంబ్లీ స్థానం సామాజిక సమీకరణాల ప్రకారం టీడీపీకి ప్రతికూలమైన సీటుగా ఉంటూ వస్తోంది. గడచిన నాలుగు పర్యాయాలుగా ఇక్కడ టీడీపీ గెలవలేదు. అలాంటి స్థానంలో టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఏళ్లుగా తను చేస్తున్న సేవలతో ప్రజలకు దగ్గరయ్యారు. అధినేతను మెప్పించి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలబడ్డారు. కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి దూకుడు పెంచిన నరేంద్రవర్మ వైసీపీ అభ్యర్థి కోనరఘుపతి ఈ ఐదేళ్లలో చేసిన దోపిడీని ప్రజల ముందుంచడంతో పాటు తాను గెలిస్తే చేయబోయే పనులను ప్రజలకు వివరించడంలో సఫలీకృతులయ్యారు. చేరికలు కూడా పెద్దఎత్తున సాగాయి. దీంతో రెండుదశాబ్దాల తర్వాత బాపట్ల నియోజవర్గంలో కూటమి పార్టీల సహకారంతో పసుపు జెండా ఎగరనుందనే అంచనాలు వెలువడుతున్నాయి.

అదే నిరాడంబరత, ప్రజలతో మమేకం...

అద్దంకి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఓటమెరుగని నేతగా నిలిచారు. తాజాగా అయిదో సారి బరిలో నిలబడ్డ ఆయన ప్రభుత్వ చేసిన అరాచకాలు, టీడీపీ మేనిఫెస్టోనే ప్రధాన అజెండాగా చేసుకుని జనంలోకి వెళుతున్నారు. తొలినుంచి ఓటర్లతో అతను మమేకమయ్యే తీరు, నిరాడంబరతే ఆయనకు బలాలు. పైగా ఎన్నికల సమయంలో వ్యూహాలు రచించడంలో రవికుమార్ దిట్ట అనే ప్రచారం ఉంది. వీటన్నింటికి తోడు వైసీపీ అభ్యర్థి పాణెం హనిమిరెడ్డి వలస నేత కావడంతో పాటు సొంతపార్టీ శ్రేణుల నుంచే ఆయనకు సహకారం దక్కకపోవడంతో ఇప్పటికే ఆయన కాడి వదిలేశాడన్న ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. వీటన్నింటి నేపథ్యంలో ఓటమెరుగుని నేతగా తన రికార్డును గొట్టిపాటి నిలుపుకోవడం ఖాయంగా కనబడుతోంది.

అనగాని....అదే హవా...

బడుగు, బలహీన వర్గాలపై ఐదేళ్లుగా వైసీపీ అవలంబిస్తున్న దుర్మార్గ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రేపల్లె టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ విజయం సాధించారు. తన ప్రచారంలో ఎక్కువగా టీడీపీ హయాంలో ప్రజలకు జరిగిన మేలునే గుర్తు చేస్తూ ముందుకు కదులుతున్నారు. అనగాని సొంత సామాజికవర్గం ఓట్లకు గండి కొట్టాలనే కుట్రతో అదే సామాజిక వర్గానికి చెందిన ఈవూరు గణేష్‌ను వైసీపీ బరిలోకి దించింది. ఏళ్లుగా అక్కడే పాతుకుపోయిన ఎంపీ మోపిదేవి అనుచరవర్గం అతని వెంట నడవకపోగా ఎవరిదారి వారు చూసుకోవడం టీడీపీకి మరింత కలిసొచ్చింది. టీడీపీ అత్యంత బలంగా ఉన్న నియోజకవర్గాల్లో రేపల్లె ఒకటి. దీనికి తోడు వైసీపీ తలాతోక లేని నిర్ణయాలతో టీడీపీ గెలుపు నల్లేరు మీద నడకేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

గాడిన పెట్టగలిగారు....

అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో చీరాల టీడీపీ ఇన్‌చార్జిగా నియోజకవర్గంలో అడుగుపెట్టిన ఎంఎం కొండయ్య స్వల్ప సమయంలోనే పార్టీని గాడిన పెట్టడంలో విజయం సాధించారు. 2019 లో టీడీపీనుంచి గెలిచిన వ్యక్తి వైసీపీలోకి వెళ్లడంతో క్యాడర్ అంతా కూడా ఆయననే అనుసరించింది. వారందరినీ తిరిగి సొంతగూటికి తేవడంలో మెరుగైన ఫలితాలే రాబట్టగలిగారు. దీంతో చీరాల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కొండయ్యకే చంద్రబాబు అవకాశం కల్పించారు. సమన్వయం విషయంలో కొన్నిలోటుపాట్లు ఉన్నా కూటమి పార్టీల సహకారంతోడు పాలకపార్టీపై ఉన్న వ్యతిరేకత కూడా కలిసొచ్చి చీరాలలో మళ్లీ టీడీపీ జెండానే ఎగురుతుందనే ధీమాను టీడీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

బాపట్ల పార్లమెంట్ స్థానం కూడా...

బాపట్ల పార్లమెంట్ స్థానం నుంచి కూటమి పార్టీల మద్దతుతో టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న టి.కృష్ణప్రసాద్ విషయంలో అనేక సానుకూలతలు కనబడుతున్నాయి. ముఖ్యంగా అతను విద్యావంతుడు కావడం, ఐపీఎస్ ఆఫీసర్‌గా వివిధ క్యాడర్‌లలో అతను అందించిన సేవలు ప్రజల ముందు ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. వీటికి తోడు సిట్టింగ్ ఎంపీ, వైసీపీ అభ్యర్థి నందిగం సురేష్ మీద ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కూడా ఆయనకు కలిసొచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఈ ఐదేళ్లలో తమకు ఎంపీ సురేష్ ఎప్పుడూ కనబడలేదని అతనికి ఎందుకు ఓటేయాలని ప్రజలు బహిరంగంగానే చెప్పడం గమనార్హం. టీడీపీ ఎంపీ అభ్యర్థికి ఉన్న ట్రాక్ రికార్డుకు తోడు వైసీపీ అభ్యర్థి మీద ప్రజలలో గూడుకట్టుకున్న వ్యతిరేకత తోడయి ఎంపీ స్థానం కూడా టీడీపీ ఖాతాలో పడే అవకాశాలే స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

- కూటమి గెలుపుతోనే సంక్షేమం
- ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి
- మండుటెండలో మద్దతుగా నడిచిన మహిళలు, యువత

ఇంకొల్లు, మే 5 : వైసీపీ పాలకులు అధికారాన్ని అడ్డంపెట్టుకొని రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని, రైతులనూ తీవ్రంగా నష్టపరిచారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం ఇంకొల్లు మండలంలో మండుటెండలో ప్రచారం నిర్వహించారు. నాగండ్ల, నక్కలపాలెం, సూదివారిపాలెం, ఇడుపులపాడు, పూసపాడు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం సాగించారు. పెదనక్కలపాలెం, నాగండ్లలో ఏలూరి వెంట ఎండను కూడా లెక్కచేయకుండా మహిళలు, యువత పాల్గొన్నారు. ఎదురెళ్లి ఏలూరికి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ కూటమి గెలుపుతోనే రాష్ట్రంలో అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ కమీషన్ల పిచ్చికి, దౌర్జన్యానికి భయపడి రాష్ట్రంలో పరిశ్రమాధిపతులు పరారయ్యారన్నారు. దీంతో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయన్నారు. జగన్‌కు పాలన చేతగాక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. నీటి వనరులకు సరైన ప్రణాళిక లేక రైతులను నష్టాలపాలు చేసారన్నారు. ఇసుక పాలసీని తెచ్చి భవన నిర్మాణకార్మికుల పొట్టకొట్టారన్నారు. వైసీపీ నేతలు ఇసుకను దోపిడీ చేసి కోట్లు కొల్లగొట్టారన్నారు. మద్య నిషేధమని చెప్పి జగన్‌రెడ్డి సొంత బ్రాండ్‌ను ప్రభుత్వమే అమ్మేలా చేసి కోట్లు దండుకున్నారని అన్నారు. పైగా నాసిరకం మద్యంతో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడారన్నారు. ఇది చాలక ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకొచ్చారన్నారు. ఇలాంటి దోపిడీ పాలకులను ఓటుతో తరిమేయాలని ఏలూరి పిలుపునిచ్చారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే అర్హులైన పేదలకు 2 సెంట్ల ఇంటి స్థలంలో నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ ద్వారా వేలాది మందికి లోన్లు ఇప్పించి వారికి ఆర్థిక భరోసా కల్పించామన్నారు. కమ్యూనిటీ భవనాలను ఏర్పాటు చేసామన్నారు. సామాజిక పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ఇస్తామన్నారు. చంద్రన్న బీమా 10 లక్షలకు పెంచామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని ఏలూరి తెలిపారు. నక్కలపాలెంలో చర్చిలో ప్రార్థనలు చేసారు. నాగండ్లలో మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సూదివారిపాలెంలో పొలాల్లోని కూలీలను కలసి ఓట్లను అభ్యర్థించారు. కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పర్చూరు నియోజవర్గ ఇన్‌చార్జి పెదపూడి విజయకుమార్ పాల్గొన్నారు. ఇంకొల్లులో ఎల్ఈడీ స్క్రీన్‌తో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


నక్కలపాలెంలో ఏలూరి వెంట నడుస్తున్న యువత

ముమ్మరంగా కూటమి నేతల ప్రచారం

చినగంజాం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో టీడీపీ కూటమి నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని చినగంజాం, అంబేడ్కర్‌నగర్, పూలవారిపాలెం, ప్రభుదేవాకాలనీ, నీలాయపాలెం, రాజుబంగారుపాలెం, పెదగంజాం తదితర గ్రామాల్లో టీడీపీ కూటమి అస్లెంబీ, పార్లమెంట్ అభ్యర్థులు ఏలూరి సాంబశివరావు, కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆదివారం నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారం చేపట్టారు. ఈవీఎం బ్యాలెట్ నమూనాలో గుర్తులను చూపిస్తూ నాయకులు ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 19-59 వయస్సు కలిగిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఆడబిడ్డల చదువుకు రూ.15,000, డ్వాక్రాలకు వడ్డీలేని రూ.10లక్షల రుణం, రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.


జనార్దన్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

టీడీపీ హయాంలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు

టీడీపీ ప్రభుత్వంలోనే ఆర్యవైశ్యలకు తగిన ప్రాతినిధ్యం, గౌరవం లభించాయని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్ అన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు పర్చూరు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ వాణిజ్య విభాగం నాయకులతో కలిసి ఆయన ఆదివారం మండల పరిధిలోని గొనసపూడి, పెదగంజాం, పల్లెపా లెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గొనసపూడి, పెదగంజాం, పల్లెపాలెం గ్రా మాల్లోని ఆర్యవైశ్య కుటంబాలను కలిసి, సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ నాయకు లు ఓట్లను అభ్యర్థించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్యవైశ్యలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికాభివృద్ధికి కృషి చేసిందని నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు, నాయకులు మురళీమోహన్, గుర్రం శ్రీను, వినోద్, శ్రీకాంత్, నాని పాల్గొన్నారు.

మార్టూరులో ఏలూరి విస్తృత పర్యటన

మార్టూరు : మార్టూరులో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం మార్టూరులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జనార్దన్ కాలనీకి చేరుకున్న ఏలూరికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆప్యాయంగా పలుకరిస్తూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఏలూరి కోరారు. యుకులు, మహిళలు, వృద్ధుల సైతం పెద్ద ఎత్తున తరలివచ్చి ఏలూరికి మద్దత్తుగా నిలిచారు. అరాచక వైసీపీ పాలనను సాగనంపి రాష్ట్ర భవిష్యత్‌కు సహకరించాలని ఆయన కోరారు.

సాంబన్నను గెలిపించండి..అభివృద్ధికి బాటలు వేయండి


మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ఎమ్మెల్యే సాంబన్నను అఖండ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్య ర్థి ఏలూరి విజయాన్ని కాంక్షిస్తూ మార్టూ రు మండల పరిధిలోని వలపర్ల మార్టూరు గ్రామాలలో ప్రచారంలో పాల్గొని సభలో మాట్లాడారు. 50 ఏళ్ల పర్చూరు చరిత్రలో అభివృద్ధి అనే ఆయుధాన్ని ప్రజలకు పరిచయం చేసిన వ్యక్తి ఏలూరి అన్నారు. విద్యావంతుడిగా ఉద్యోగిగా, ప్రజాసేవకుడిగా ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే ఏలూరి ప్రజలకు విస్తృత సేవలందించారన్నారు. రాజకీయాలకతీతంగా పర్చూ రు అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి సాంబన్న అన్నారు. అనునిత్యం ప్రజలకు తోడునీడుగా ఉంటూ వారి శ్రేయస్సు కోసం తపించే వ్యక్తి ఏలూరి అన్నారు. వైసీపీ మాయ మాటలు నమ్మి ప్రజలు బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. మీరు వేసే ఓటే నియోజకవర్గ, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధికి నోచుకోలేదన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను దీవించాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని, పిల్లల బంగారు భవిష్యత్ సాధ్యపడుతుందని తెలిపారు. సాంబన్నకు అండగా నిలిచి అద్భుత విజయాన్ని అందించి పర్చూరును అభివృద్ధిలో రాష్ట్రానికే తలమానికంగా నిలపాలన్నారు. వలపర్ల మార్టూరులో నర్సిరెడ్డి సభలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయన మాట్లాడినంతసేపు ప్రజలు కదలకుండా ఆసక్తిగా తిలకించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని నర్సిరెడ్డి తన మాటలతో వివరించారు. సాంబన్న ను గెలిపించాలని కోరారు.

రెండు గ్రామాల్లో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన నక్కబొక్కలపాడు, ఉప్పుమాగులూరు గ్రామస్థులు

బల్లికురవ, మే 5 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ పార్టీకి షాక్ తగిలింది. మండలంలోని నక్కబొక్కలపాడుకు చెందిన వైసీపీ ముఖ్యనేత కట్టా సుధాకర్ తన అనుచరులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో సైకిల్ ఎక్కారు. మండలంలోని ఉప్పుమాగులూరు ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్తలు జొన్నలగడ్డ లెవిబాబు, శ్రీను, ఒంటరి చిన్న ఈశ్వరయ్య, కృపారావు, ఏసుబాబు, సంతయ్య, కోటేశ్వరరావు, నాసరయ్య, నాగయ్య, మాణిక్యరావు, జంధ్రాజుపల్లి ప్రభుదాసు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ విజయానికి అందరూ కృషి చేయాలని గొట్టిపాటి కోరారు. కార్యక్రమంలో గ్రామాల టీడీపీ నేతలు అమరనేని కాశీవిశ్వనాథం, దేవినేని నరేంద్ర, అమరనేని వినోద్ పాల్గొన్నారు.


గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన ఉప్పుమాగులూరు ఎస్సీ కాలనీవాసులు

కూటమి గెలుపుతోనే రాష్ట్ర భవిష్యత్

కొత్తమల్లాయపాలెంలో బాబీ ఎన్నికల ప్రచారం

బల్లికురవ : గత అయిదేళ్ల వైసీపీ విధ్వంస పాలన నుంచి ప్రజలు బయటపడి, రాష్ట్ర అభివృద్ధి పరుగు తీయాలంటే టీడీపీ కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని టీడీపీ యువ నేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం మండలంలోని కొత్తమల్లాయపాలెం గ్రామంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్‌కిషోర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అయన ఇంటింటికీ తిరిగి చంద్రబాబు అమలు చేయనున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అన్నివర్గాల వారికి సమ న్యాయం జరిగేలా మేనిఫెస్టోను రూపొందించారని తెలిపారు. ఒక్క చాన్స్ ఇచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అన్యాయానికి గురయ్యారన్నారు. ప్రశ్నించేవారిని భయపెట్టడం, దాడులు చేయడం, లేకుంటే హత్య చేయడమే వైసీపీ పనిగా పెట్టుకుందని ఆరోపించారు. నవరత్నాల పథకాల ముసుగులో నవ మోసాలకు జగన్‌రెడ్డి పాల్పడ్డారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ధరలు పెరిగిపోయాయని, బస్సు, కరెంట్ చార్జీలు పేదలకు అందు బాటులో లేవన్నారు. ఒక్క కంపెనీని కూడా ఏర్పాటు చేయకుండా నిరుద్యోగులను నిలువునా మోసగించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. చంద్రబాబు సీఎం కాగానే తొలి సంతకం డిఎస్సీపైనే ఉంటుం దన్నారు. 70 శాతం పూర్తి చేసిన పోలవరం ప్రాజెక్టును కూల్చేందుకు జగన్ కుట్ర పన్నారన్నారు. మూడు రాజధానులంటూ రాజధాని లేని రాష్ట్రంగా, అప్పుల రాష్ట్రంగా, మద్యం, గంజాయి, మత్తు పదార్థాల విక్రయాల అడ్డాగా ఆంధ్రప్ర దేశ్‌ను మార్చేశారని ఆరోపించారు. ఐదేళ్లు ప్రజలతో ఆడుకున్న జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పే సమయం మీ చేతికి వచ్చిందన్నారు. 13వ తేదీన జరిగే పోలింగ్ రోజు సైకిల్ గుర్తుపై ఓటు వేసి జగన్‌రెడ్డిని సాగనంపాలని బాబీ విజ్ఞప్తి చేశారు. కూ టమి ఎమ్మెల్యేగా గొట్టపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జూపల్లి రామలింగయ్య, శేషయ్య, కొండూరి నాగయ్య, వేల్పుల దానయ్య, లేమాటి హనుమంతురావు, అబ్బారెడ్డి బాలకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

గోపాలపురంలో హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం

అద్దంకి, మే 5 : రా ష్ట్రం లో అభివృద్ధి , సంక్షేమం చం ద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. మండలంలోని గోపాలపురంలో ఆదివారం ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గొట్టిపాటి హయాంలో నియోజకవర్గంలో రోడ్లు, వసతుల కల్పన జరిగిందన్నారు. సాగు, తాగు నీరు అందించారన్నారు. వివిధ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు అందించారన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్‌ను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలన్నారు. టీడీపీ నేతలు యర్రా రాఘవయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న బాబీ

సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు మేలు : ఝాన్సీ


రామకూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ

పంగులూరు, మే 5 : కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమలయ్యే సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఎంతో మేలు కలుగుతుందని గొట్టిపాటి ఝాన్సీ అన్నా రు. మండలంలోని రామకూరు గ్రామంలో ఆదివారం రాత్రి గొట్టిపాటి ఝాన్సీ స్థానిక నేతలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తల్లికి వందనం, ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.10లక్షల వరకు వడ్డీలేని రుణం, నిరుద్యోగ భృతి లాంటి పథకాలతో ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. 13న జరిగే ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్‌ను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాని కోరారు. ప్రచారం లో మాజీ సర్పంచ్‌లు మానం సుబ్బారావు, తొట్టెంపూడి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ పెడవల్లి అశోక్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

గొట్టిపాటి, కృష్ణప్రసాద్‌ను గెలిపించండి

ఎన్నికలలో కూటమి అభ్యర్థులైన గొట్టిపాటి, కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, మేడ సుబ్బారావు, జాగర్లమూడి సుబ్బారావు, చిలుకూరి కోటయ్య, నాగేశ్వరరావు, చౌదరిబాబు పాల్గొన్నారు.


గోపాలపురంలో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

అరాచకం.. దోపిడీ.. విధ్వంసం..!

జగన్‌రెడ్డి పాలనపై ఎమ్మెల్సీ అనూరాధ


మాట్లాడుతున్న అనూరాధ

చీరాల, మే 5 : వైసీపీ పాలనంతా పై నుంచి కింద దాకా అరాచకం, దోపిడీ, విధ్వంసమేనని ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చేనేత సామాజకవర్గానికి జగన్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. ఆనాడు జగన్ తాత రాజారెడ్డి నుంచి నేడు జగన్ వరకు చేనేత సామాజిక వర్గానికి చెందిన వారిపై చేసిన దాడులు, చేసిన అవమానకర పనులను వివరించారు. అందుకు ధర్మవరం, విజయవాడలలో జరిగిన సంఘటలను ఉదాహరణగా చెప్పారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో అక్కడి రెవెన్యూ అధికారులు ఓ సామాన్య కుటుంబానికి చెందిన భూమిని వైసీపీ నేత పేరుపై ఎక్కించారన్నారు. దాంతో ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడగా మిగిలిన అమ్మాయి చదువు నుంచి వివాహం వరకు అన్ని బాధ్యతలను తాము తీసుకుంటాని ప్రజాగళంలో చంద్రబాబు ఇచ్చిన హామీని వివరించారు. అభివృద్ధి అంటూ జరిగితే అది చంద్రబాబు హయాంలోనే జరిగిందన్నారు. 2019 ఎన్నికల ఫలితాల నుంచి రాష్ట్రంలో చీకటి రోజులు ప్రారంభమయ్యాయన్నారు. వాటిని తొలగించేందుకు తొలిపొద్దు సూర్యకిరణంగా తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరు జనసే, బీజేపీ, టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆ క్రమంలో చీరాలలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్యను అత్యధిక మెజార్టీతో గెలపించాలని పిలుపునిచ్చారు.

కూటమి రాగానే టిడ్కో ఇళ్లు పూర్తి

- జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు తీరని నష్టం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి


18వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, మే 5 : టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని 8, 18 వార్డులలో ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు మహాశక్తి పథకం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, ఉచిత బస్సు ప్రయాణం, 18 నుంచి 59 ఏళ్ల వయస్సు మహిళలకు రూ.1500 అందిస్తామన్నారు. యువతకు 3వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. వైసీపీ పాలనలో ప్రజలంతా తీవ్రంగా నష్టపోయారన్నారు. వైసీపీ అధికారంలో వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చారన్నారు. రాష్ట్రంలో విధ్వంసంతో పరిపాలన ప్రారంభించారన్నారు. చెత్త మీద పన్ను వేసిన ఏకైక ప్రభుత్వం జగన్‌రెడ్డిదేనన్నారు. ఐదేళ్లలో కరెంట్ చార్జీలను 9 సార్లు పెంచారన్నారు. జే బ్రాండ్ మద్యం వ్యాపారంతో పేదలను దోచుకుంటున్నారన్నారు. టీడీపీ హయంలో అద్దంకి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.84 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయిందన్నారు. సైకిల్‌కు ఓటేసి ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కుందారపు రామారావు, కాకాని అశోక్, పూనూరి నరేంద్ర, స్టాలిన్, ప్రసాద్, రామాంజనేయులు, రామాంజనేయులు, శ్రీనివాసరావు, పరిటాల నాగేశ్వరరావు, మద్దా ఆంజనేయులు, కడియం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కూటమికి ఓటేయండి

ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య పిలుపు


మహేంద్రనాథ్ సమక్షంలో టీడీపీలో చేరిన 32వ వార్డువాసులు

వేటపాలెం(చీరాల), మే 5 : ప్రతి ఒక్కరు ఆలోచించి.. అభివృద్ధి కోసం కూటమికి ఓటేయాలని.. అభివృద్ధిలో అందరం కలిసి ముందుకు వెళ్దామని కొండయ్య పిలుపునిచ్చారు. 13న జరిగే పోలింగ్ రోజు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గు ర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ కూ టమి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కోరారు. మం డల పరిధిలోని రామానగర్ చౌడేశ్వరి అమ్మవా రి దేవాలయం నుంచి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండయ్య నాయకు లు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ తిరుగుతూ కూటమి మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా సమస్యలను ప్రా ధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ 6తో అందరికీ ప్రయోజనం

టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అందరికీ ప్రయోజనం చేకూరుతుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య కోడలు స్పందన, డాక్టర్ సజ్జా హేమలత చెప్పారు. చీరాల మండలం దేవాంగపురిలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మహిళలతో కలసి వారు విస్తృతంగా పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అయితేనే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్య, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తులపై ఓట్లువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీ డీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య కోడలు స్పందన

టీడీపీలో చేరిన పలువురు

టీడీపీ కార్యాలయంలో ఆదివారం పలువురు ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. 5వ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మీ, ఆమె భర్త నరసింహారావు తదితరులను కొండయ్య పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. 32వ వార్డుకు చెందిన బొల్లాపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు కొండయ్య కుమారుడు మహేంద్రనాథ్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని ఆయన పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గొట్టిపాటికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న మహిళలు

తొలిసంతకం డీఎస్సీపైనే

సంతమాగులురు, మే 5 : చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ పైనే పెడతారని టీడీపీ మండల అధ్యక్షుడు గాడిపర్తి వెంకట్రావు తెలిపారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ పాత మాగులురు, కామేపల్లి, వెల్లలచెరువులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగన్‌రెడ్డి పాలనలో దళితులపై జరిగిన దాడులు, వారికున్న 27 పథకాల రద్దును వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు, జేపంగులూరు టీడీపీ కార్యదర్శి ఉన్నాం రవికుమార్, మాజీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ చిన్న, ఆమోస్, ఎమ్మార్పీఎస్ రమేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో కొమ్మాలపాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాని విజ్ఞప్తి చేశారు.

పేద కుటుంబానికి టీడీపీ సాయం

అద్దంకి, మే 5 : మండలంలోని తిమ్మాయపాలెం ఎస్సీ కాలనీలో భర్త మృతి చెందడంతో ముగ్గురు కుమార్తెలు, కుమారుని చదువు కోసం జీ పరిశుద్ధం ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత పరిటాల శ్రీనివాసరావు తన తల్లి జ్ఞాపకార్థం రూ.5వేల సాయాన్ని అందజేశారు. ఏనుగంటి శివప్రసాద్, తోకల రాజేష్ పాల్గొన్నారు.

మూలకు చేరిన చేతిపంపులు

- మరమ్మతులను పట్టించుకోని అధికారులు
- వాడుక నీరూ దొరక్క ఇబ్బందిపడుతున్న ప్రజలు


కొమ్మినేనివారిపాలెంలో పాడైన చేతి పంపు

బల్లికురవ, మే 5 : వేసవి ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో గ్రామాలలో ప్రజలు నీటి ఎద్దడితో విలవిలలాడుతున్నారు. నెలల తరబడి చేతులు పంపులు మర్మతులకు గురై అలంకారప్రాయంగా కన్పిస్తున్నాయి. దీంతో వాడుక నీరు కూడా దొరకక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చేతి పంపుల మరమ్మతులకు మండల పరిషత్ కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా ముగ్గురు మెకానిక్‌లున్నా ఎక్కడా ఆ పనులు చేసిన దాఖలాలు లేవు. మరోపక్క అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కొన్ని గ్రామాలలో చేతి పంపులు మరమ్మతులు చేయక ప్రభుత్వ బోర్లకు, ప్రైవేటు బోర్లకు మోటార్లను అమర్చుకొని వాడుకుంటున్నారు. దీంతో పది మందికి ఉపయోగపడాల్సినవి కొందరికే పరిమితమవుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బల్లికురవ మండలంలో 21 గ్రామ పంచాయతీలుండగా సుమారు వెయ్యి వరకు ప్రభుత్వ చేతి పంపులు ఉన్నాయి. వీటి మర్మతులకు గాను మండల ప్రజా పరిషత్ కార్యాలయం నిధుల ద్వారా కేటాయిస్తున్నారు. మర్మతులు చేసే మెకానిక్‌లకు కూడా మండల పరిషత్ ద్వారానే జీతాలు ఇస్తున్నారు. కానీ మర్మతులు చేయించే పర్యవేక్షణ మాత్రం లేదు. దీంతో గ్రామాలలో కొన్ని నెలల నుంచి చేతి పంపులు పాడై ఉన్నాయి. వేసవి ఎండలు పెరగడంతో నీటి ఎద్దడి పెరిగింది. మండలంలోని అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం, వైదన, కొప్పెరపాడు, గంగపాలెం, కొణిదెన, వెలమవారిపాలెం, కొత్తూరు, వల్లాపల్లి, కూకట్లపల్లి, ఎస్ఎల్‌గుడిపాడు గ్రామాలలో చేతి పంపులు పెద్ద ఎత్తున మరమ్మతులకు గు రై ఉన్నాయి. మండల పరిషత్ అధికారులు మాత్రం ఇవేమీ తమకు కనిపించవు అన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి. గ్రామాలలో చేతి పంపుల మర్మమ్మతులకు గురైన విష యం చెప్పేందుకు కూడా ఎంపీడీవో కార్యాలయంలో రికార్డు నమోదు లేదని, దీంతో ఎవరికి చెప్పాలో కూడా తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల సాకు చూపించి అధికారులు పట్టిం చుకోవడం లేదని చెప్తున్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని అధికారులు తక్షణమే గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.


వైదనలో పాడైన బోరుకు బిగించిన ప్రైవేటు మోటార్


అంబడిపూడిలో మర్మమ్మతులకు గురైన చేతి పంపును చూపుతున్న స్థానికులు